

అనకాపల్లి జనసేన అభ్యర్థిగా కొణతాల

అనకాపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కొణతాల రామకృష్ణకు జనసేన పార్టీ అనకాపల్లి అసెంబ్లీ స్థానం కేటాయించింది. కొణతాలకు అభ్యర్థిత్వం ఖరారు కావడంతో ఆయన వర్గీయులు శనివారం అనకాపల్లి నెహ్రూ చౌక్‌లో బాణసంచా కాల్చి సం బరాలు చేసుకున్నారు.


కొణతాల రామకృష్ణ

గవర సామాజిక వర్గానికి చెందిన కొణతాల రామకృష్ణ 1989 నుంచి 1996 వరకు అనకాపల్లి పార్లమెంట్ సభ్యుడిగా పనిచేశారు. 1991-96 మధ్య ఏపీ పార్లమెంటు సభ్యుల కన్వీనర్‌గా పనిచేశారు. 1999లో అనకాపల్లి అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి ఓటమి పాలైన కొణతాల...2004 ఎన్నికల్లో గెలిచి అప్పటి సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంత్రివర్గంలో వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, న్యాయ తదితర శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2009 ఎన్నికల్లో అనకాపల్లి నుంచి మరోసారి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం వైఎస్ఆర్ సీపీలో చేరారు. పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. 2014 ఎన్నికల అనంతరం కొణతాల వైఎస్ఆర్‌సీపీకి రాజీనామా చేశారు. అప్పటి నుంచి ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ ఉత్తరాంధ్ర సమస్యలపై సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. జనవరి 17న హైదరాబాద్‌లో పవన్‌కల్యాణ్‌తో భేటీ అయ్యారు. ఆ తరువాత విజయవాడలో జనసేన సభ్యత్వాన్ని తీసుకున్నారు.

గండి బాబ్జీకి చంద్రబాబు పిలుపు

విశాఖపట్నం, ఫిబ్రవరి 24: తెలుగుదేశం అధిష్ఠానం నుంచి విశాఖ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీకి పిలుపువచ్చింది. శనివారం అభ్యర్థుల తొలి జాబితా విడుదల చేయడంతో మిగిలిన సీట్లపై ఉత్కంఠ నెలకొంది. ఇదే సమయంలో 'సౌత్' సీటును జనసేన కోరుతున్నట్టు ప్రచారం జరుగుతుంది. రెండేళ్ల క్రితం దక్షిణ ఇన్‌చార్జిగా నియమితులైన గండి బాబ్జీ... పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ కేడర్‌ను ఎన్నికలకు సమాయత్తం చేశారు. ఈ తరుణంలో ఆయన్ని అధిష్ఠానం నుంచి పిలుపురావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అధినేత చంద్రబాబునాయుడు స్వయంగా బాబ్జీకి ఫోన్ చేసి విజయవాడ రావాలని సూచించారు.

'దేశం' తొలి జాబితాలో

'తూర్పు' నుంచి వెలగపూడి, 'పశ్చిమ' నుంచి గణబాబు... మరోసారి పోటీ

ఇద్దరికి చోటు

- ఇద్దరూ సీనియర్లే...అసెంబ్లీకి మూడేసిసార్లు ఎన్నిక
- మరో 5 సీట్లు పెండింగ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి):

తెలుగుదేశం శనివారం విడుదల చేసిన తొలి జాబితాలో జిల్లా నుంచి ఇద్దరు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మాత్రమే అవకాశం దక్కింది. విశాఖ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వెలగపూడి రామకృష్ణబాబు, పెతకంశెట్టి గణబాబులకు టికెట్లు కేటాయించారు. ఉండవల్లిలో తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు విడుదల చేసిన జాబితాలో ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం ఐదుగురి పేర్లు ఉన్నాయి. నర్సీపట్నం నుంచి చింతకాయల అయ్యన్నపాత్రుడు, పాయకరావుపేట నుంచి వంగలపూడి అనిత, అరకులోయ నుంచి దొన్నుదొర పోటీకి దిగనున్నారు. ఇక పొత్తులో భాగంగా అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించారు. అక్కడ నుంచి మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ పోటీ చేస్తారని ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించారు.


వెలగపూడి రామకృష్ణబాబు
టీడీపీ-జనసేన ఉమ్మడి
విశాఖ తూర్పుఅభ్యర్థి


పెతకంశెట్టి గణబాబు
టీడీపీ-జనసేన ఉమ్మడి
విశాఖ పశ్చిమ అభ్యర్థి

తొలి జాబితాలో సీట్లు దక్కించుకున్న వెలగపూడి రామకృష్ణబాబు, పెతకంశెట్టి గణబాబు ఇద్దరూ సీనియర్లే. ఒక్కొక్కరు మూడు పర్యాయాలు తెలుగుదేశం నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. గణబాబు ఇప్పటివరకూ నాలుగు పర్యాయాలు పోటీ చేయగా తాజాగా ఐదోసారి ఆయనకు టికెట్ లభించింది. విశాఖ తూర్పు నుంచి ఇప్పటివరకు మూడుసార్లు పోటీ చేసి విజయం సాధించిన వెలగపూడి నాలుగోసారి అదే స్థానం నుంచి బరిలో దిగనున్నారు.

నాలుగోసారి వెలగపూడి పోటీ

అసెంబ్లీ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఏర్పడిన విశాఖ తూర్పు నియోజకవర్గం నుంచి తొలిసారి 2009లో టీడీపీ పక్షాన వెలగపూడి రామకృష్ణబాబు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆ తరువాత 2014, 2019 ఎన్నికల్లో వరుసగా అదే సీటు నుంచి గెలిచి హ్యాట్రిక్ సాధించారు. నిత్యం ప్రజల్లో ఉండే వెలగపూడి నియోజక వర్గంలో గల అన్ని సామాజిక వర్గాల వారితో సత్సంబంధాలు కలిగి ఉన్నారు. నగరంలో పార్టీకి వెన్నుదన్నుగా ఉంటూ అధిష్ఠానానికి విధేయుడిగా ఉంటారు. ఈ నేపథ్యంలోనే వెలగపూడికి మరోసారి అవకాశం లభించింది. కాగా విజయవాడ నగరానికి చెందిన వెలగపూడి బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తిచేసి వ్యాపార రీత్యా మూడు దశాబ్దాల క్రితం విశాఖ వచ్చారు.

గణబాబు...

పెతకంశెట్టి గణ వెంకట రెడ్డినాయుడు(గణబాబు) రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి. ఆయన తండ్రి అప్పలనరసింహం పెందుర్తి ఎమ్మెల్యేగా, అనకాపల్లి ఎంపీగా తెలుగుదేశం తరపున గెలుపొందారు. అప్పల నరసింహం వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన గణబాబు 1995లో మొదటిసారి పెందుర్తి జడ్పీటీసీ సభ్యుడిగా టీడీపీ తరపున ఎన్నికయ్యారు. ఆ తరువాత 1999 ... మిగతా 6వ పేజీలో

మరింత బాధ్యతతో పనిచేస్తా

- వెలగపూడి రామకృష్ణబాబు

తూర్పు నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడానికి తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు మరోసారి అవకాశం ఇచ్చినందుకు సంతోషం. రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారికి సేవ చేస్తున్నా. అధినేత చంద్రబాబు నమ్మకాన్ని వమ్ముచేయకుండా మరింత బాధ్యతతో పనిచేస్తా. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, ప్రజల సహకారంతో మంచి మెజారిటీతో విజయం సాధిస్తా.

అధిష్ఠానం నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

- గణబాబు, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే

పశ్చిమ నియోజకవర్గం నుంచి మరోసారి పోటీ చేయడానికి అవకాశం కల్పించిన తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు. అధినేత నాపై చూపిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. మరోసారి విజయం సాధిస్తా. చంద్రబాబునాయుడి సహకారంతో ఎన్ఏడీ ఫ్లైఓవర్, జింక్ నుంచి సింధియా వరకు రోడ్డు సుందరీకరణ, ఎన్ఎస్‌టీఎల్ వద్ద రోడ్డు విస్తరణ చేపట్టడం జరిగింది. అలాగే 10,500 మంది పేదలకు పట్టాలు పంపిణీ, ఏడువేల మంది పేదలకు ఇళ్ల మంజూరు చేశాం. ప్రజల ఆశీర్వాదంతో మరోసారి అసెంబ్లీలో అడుగుపెట్టి నగర, నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తా.

అనకాపల్లి జిల్లాలో ఇద్దరు అభ్యర్థులు ప్రకటన

- నర్సీపట్నం నుంచి అయ్యన్నపాత్రుడు
- పాయకరావుపేటకు వంగలపూడి అనిత
- పొత్తులో భాగంగా అనకాపల్లి సీటు జనసేనకు కేటాయింపు


అయ్యన్నపాత్రుడు


వంగలపూడి అనిత

అనకాపల్లి, నర్సీపట్నం, పాయకరావుపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి జిల్లాలో మూడు అసెంబ్లీ స్థానాలకు తెలుగుదేశం పార్టీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులు ఖరారయ్యారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు (ఆరు పూర్తిగా, ఒకటి (పెందుర్తి) పాక్షికంగా) ఉండగా, అనకాపల్లి, నర్సీపట్నం, పాయకరావుపేట అసెంబ్లీ స్థానాలకు శనివారం అభ్యర్థులను ప్రకటించారు.

నర్సీపట్నం అభ్యర్థిగా మాజీ మంత్రి, సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు, పాయకరావుపేట (ఎస్సీ) స్థానానికి తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, అనకాపల్లి స్థానానికి జనసేన అభ్యర్థిగా మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ పేర్లు ఖరారయ్యాయి. జిల్లాలో చోడవరం, ఎలమంచిలి, మాడుగుల, పెందుర్తి స్థానాలకు టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.

పదోసారి అసెంబ్లీ ఎన్నికల బరిలోకి అయ్యన్న

అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గం నుంచి చింతకాయల అయ్యన్నపాత్రుడు మరోమారు ఎన్నికల బరిలో దిగనున్నారు. ఆయన ఇప్పటివరకు తొమ్మిదిసార్లు అసెంబ్లీకి, ఒకసారి అనకాపల్లి నుంచి పార్లమెంటుకు పోటీ చేశారు. పదోసారి నర్సీపట్నం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. అయ్యన్నపాత్రుడు 1983లో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసి సమీప కాంగ్రెస్ అభ్యర్థి రాజసాగి రామచంద్రరాజుపై గెలుపొందారు. ఆ తరువాత 1985, 1989, 1994, 1999, 2004, 2009, 2014, 2019 ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేశారు వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేశ్ చేతిలో ఓటమి చెందారు. ఆరుసార్లు గెలుపొందారు. ఎన్టీఆర్ క్యాబినెట్‌లో 29 ఏళ్ల వయస్సులో మంత్రిగా పనిచేసే అవకాశం అయ్యన్నకు దక్కింది. 1985-87లో సాంకేతిక విద్యా శాఖ మంత్రిగా, 1994-96 ఆర్ అండ్ బీ మంత్రిగా, 1999 నుంచి 2004 వరకు అటవీశాఖా మంత్రి, 2014-17 పంచాయతీరాజ్ శాఖా మంత్రిగా, 2017-19 వరకు ఆర్ అండ్ బీ మంత్రిగా పనిచేశారు. 1996లో అనకాపల్లి ఎంపీగా ఉన్న పెతకంశెట్టి అప్పలనరసింహం మృతిచెందడంతో జరిగిన ఉప ఎన్నికల్లో అయ్యన్నపాత్రుడు పోటీ చేసి విజయం సాధించారు.

పేట నుంచి అనిత

పాయకరావుపేట నియోజకవర్గ అభ్యర్థిగా వంగలపూడి అనితను టీడీపీ అధిష్ఠానం ప్రకటించింది. ఆమె మొదటిసారి 2014 ఎన్నికల్లో పాయకరావుపేట నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2019లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరులో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తరువాత ఆమెను పాయకరావుపేట ఇన్‌చార్జిగా అధిష్ఠానం నియమించడంతో అప్పటి నుంచి పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటూ కార్యక్రమాలను సమర్థంగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా కూడా ఉన్నారు. అనితకు పార్టీ అధిష్ఠానం టికెట్ కేటాయించడంతో పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.

మహిళలు మరింత పురోగతి సాధించాలి

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా సాధికారిత దిశగా ఎదగాలని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పీఎస్ నరసింహ ఆకాంక్షించారు. దేశంలో తొలి మహిళా న్యాయవాది ఫాతిమా బీబీ భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో తొలి జడ్జిగా పనిచేసిన సంగతిని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఫెడరేషన్ ఆఫ్ వుమెన్ లాయర్స్ ఆఫ్ ఏపీ, విశాఖపట్నం ఆధ్వర్యంలో గ్రీన్‌పార్క్ హోటల్‌లో 'మహిళా సాధికారిత-రాజ్యాంగ ఆవశ్యకత' అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో అడుగుపెట్టిన మహిళలు తమను తాము నిరూపించుకున్నారన్నారు. ఆధునిక యుగంలో స్త్రీలు మరింత పురోగతి సాధించాలని సూచించారు. మహిళా న్యాయవాదులు భవిష్యత్తులో మరింత ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ మహిళా సాధికారితపై ఈ తరహా సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మహిళా ఫెడరేషన్ విజయాలతో కూడిన సీడీని ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. అనంతరం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్, హైకోర్టు జడ్జిలు జస్టిస్ బీఎస్ భానుమతి, జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, విశాఖపట్నం జిల్లా జడ్జి ఆలపాటి గిరిధర్, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ రాంబాబు, విశాఖపట్నం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి యు.దుర్గాప్రసాదరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ, తదితరులు పాల్గొన్నారు. సదస్సుకు సీనియర్ న్యాయవాది డి.అరుణకుమారి అధ్యక్షత వహించగా, ఫెడరేషన్ ఆఫ్ వుమెన్ లాయర్స్ రాష్ట్ర ప్రెసిడెంట్ కొప్పాక అరుణ, వైస్ ప్రెసిడెంట్ డి.మంజులత, ఎన్ఈసీ మెంబర్ పి.హేమామాలిని, తదితరులు పాల్గొన్నారు.


సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం, చిత్రంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఉన్నారు

అమృత్ భారత్ స్టేషన్లకు రూ.1029.87 కోట్లు

- రూ.19.98 కోట్ల వ్యయంతో సింహాచలం స్టేషన్ అభివృద్ధి
- ప్రధాని చేతులమీదుగా పనులు ప్రారంభం రేపు
- సంవత్సరాంతానికి పూర్తి చేస్తాం
- వాల్తేరు రైల్వే డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్


డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్

విశాఖపట్నం, ఫిబ్రవరి 24: అమృత్ భారత్‌లో భాగంగా చేపట్టనున్న వివిధ స్టేషన్ల నవీకరణ పనులు వార్షిక సంవత్సరాంతానికి పూర్తి చేస్తామని వాల్తేరు డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాల్తేరు డివిజన్ పరిధిలోని 12 రైల్వే స్టేషన్లలో కొత్త భవనాలు, ఆధునిక సౌకర్యాలు, పాదచారుల వంతెనలు, స్టేషన్లకు రెండో వైపు ప్రవేశ ద్వారాలు వంటి నిర్మాణ పనులకు ప్రధాని నరేంద్రమోదీ సోమవారం శంకుస్థాపన చేస్తారని తెలిపారు. నిర్ణీత సమయంలో నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ఇప్పటికే భవనాల రూపకల్పన (డిజైన్), ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అమృత్ భారత్ పథకం కింద వాల్తేరు డివిజన్‌కు మొత్తం రూ.1248 కోట్ల నిధులు మంజూరయ్యాయని, దీనిలో రూ.1029.87 కోట్లు స్టేషన్ల అభివృద్ధికి, రూ.218.13 కోట్లు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలకు వెచ్చించనున్నామని తెలిపారు. ఉత్తరాంధ్ర, ఒడిశా ప్రాంతాల నుంచి నృసింహస్వామి దేవస్థానానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం సింహాచలం స్టేషన్‌ను రూ.19.98 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసి ఆధునిక సదుపాయాలు కల్పించనున్నామన్నారు. అలాగే రూ.16.31 కోట్లతో అరకులోయ, రూ.18.77 కోట్లతో ... మిగతా 6వ పేజీలో

150 తులాల బంగారం చోరీ

- బీరువాలో పెట్టిన ఆభరణాలు మాయం

మిస్టరీగా మారిన చోరీ కేసు


బాధితుడు నివాసం వుంటున్న అపార్టుమెంటు

విశాఖపట్నం/సీతంపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో బీరువాలో ఉంచిన 150 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఇంట్లో అందరూ ఉండగానే బీరువాకు వేసిన తాళం వేసింది వేసినట్టుగా ఉన్నప్పటికీ అందులోని ఆభరణాలు కనిపించడం లేదంటూ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాలుగో పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఈ కేసు దర్యాప్తు పోలీసులకు సైతం మిస్టరీగా మారింది. పోస్టల్ శాఖలో సీనియర్ సూపరింటెండెంట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన జనపాల ప్రసాద్, ఆయన భార్య ఉషారాణి, కుమార్తె, కుమారుడితో కలిసి దొండపర్తిలోని బాలాజీ రెసిడెన్సీలో నివాసం ఉంటున్నారు. ఉద్యోగ విరమణ తర్వాత కుటుంబ సభ్యుల కోసం బంగారు ఆభరణాలు చేయించి ఇంట్లోని బీరువాలో భద్రపరిచారు. అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలో బంధువుల ఇంట శుభకార్యానికి వెళ్లేందుకు శుక్రవారం బీరువా తాళాలు తీసి చూడగా ఆభరణాలు కనిపించలేదు. దీంతో ఆందోళన చెంది ఇంట్లోవారిని ఆభరణాల గురించి అడగ్గా, తాము తీయలేదని సమాధానం ఇచ్చారు. ఈనెల 12న బీరువా తీసి చూసినపుడు ఆభరణాలు కనిపించాయని, ఆ తర్వాత కూడా ఎప్పటిలాగే బీరువా పక్కనే ఉన్న కప్‌బోర్డులో తాళాలు ఉంచామని ప్రసాద్ కుటుంబసభ్యులకు చెబుతున్నారు. ఈ మేరకు నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తక్షణం స్పందించి కేసు దర్యాప్తు ప్రారంభించారు. కుటుంబసభ్యులను విచారించడంతోపాటు క్లూస్ టీమ్‌తో ఇంట్లోని ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేశామని, ఎంత బంగారం చోరీకి గురైందీ ఇప్పుడే స్పష్టంగా చెప్పలేమని నాలుగో పట్టణ పోలీసులు చెబుతున్నారు. ప్రసాద్ ఇంటికి వచ్చివెళ్లినవారి వివరాలను సేకరించడంతో పాటు పలు కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

తీరానికి మాఘ పౌర్ణమి శోభ - వార్త I పేజీలో

పోటీపై బొత్స ఝాన్సీ సందిగ్ధం?

- నెల కిందట విశాఖ లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించిన వైసీపీ అధిష్ఠానం
- ఇంతవరకూ ప్రచారం ప్రారంభించని వైనం
- నగరంలో వాతావరణం అధికార పార్టీకి అనుకూలంగా లేదనే ఉద్దేశంతో పోటీకి ఆసక్తి చూపడం లేదనే ప్రచారం
- నేతలు, కార్యకర్తల్లో అయోమయం


బొత్స ఝాన్సీ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో వింత పరిస్థితి నెలకొంది. విశాఖ లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మంత్రి బొత్స సత్యనారాయణ భార్య ఝాన్సీలక్ష్మిని నెలరోజుల కిందటే అధిష్ఠానం ప్రకటించింది. కానీ ఇంతవరకూ ఆమె ప్రచారం ప్రారంభించకపోవడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలకు గట్టిగా రెండు నెలలు కూడా సమయం లేదు. అయినా ఆమె ప్రచారం ఊసెత్తకపోవడంతో పార్టీ నేతలు, కార్యకర్తల్లో అయోమయం నెలకొంది. అసలు ఆమె విశాఖ ఎంపీగా ఆమె పోటీ చేస్తారా?, లేదా? అనే చర్చ కూడా మొదలైంది.

2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి విశాఖ ఎంపీగా గెలిచిన ఎంవీవీ సత్యనారారాయణను అధిష్ఠానం విశాఖ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీకి నిలపాలని నిర్ణయించింది. దీంతో తూర్పు నియోజకవర్గం సమన్వయకర్తగా ఉన్న అక్కరమాని విజయనిర్మలను తొలగించి ఎంవీవీని ఆరు నెలల కిందట సమన్వయకర్తగా నియమించింది. విశాఖ ఎంపీ అభ్యర్థి కోసం అన్వేషించిన అధిష్ఠానం స్థానికంగా ఎవరూ కనిపించకపోవడంతో పొరుగు జిల్లాకు చెందిన మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మిని విశాఖ పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రకటించింది. వచ్చే ఎన్నికల్లో ఎంపీగా ఆమె పోటీ చేయడం ఖాయమని అంతా భావించారు. అయితే ఇన్‌చార్జిగా ప్రకటించి దాదాపు నెలరోజులవుతున్నా ఇంతవరకూ ఆమె ప్రజల్లోకి రాలేదు. కనీసం పార్టీ నాయకులను కలిసే ప్రయత్నం కూడా చేయకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పాండురంగాపురంలో గల బొత్స ఝాన్సీ ఇంటికి నేతలు మర్యాదపూర్వకంగా కలిసి వచ్చేస్తున్నారు తప్పితే, ఇంతవరకూ నగరంలో ఆమె ఒక్క కార్యక్రమానికి కూడా హాజరుకాకపోవడంపై పలు రకాల ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా నగరానికి కొత్త వ్యక్తిని ఇన్‌చార్జిగా నియమిస్తే వీలైనంత త్వరగా ప్రజల్లోకి వెళ్లి పరిచయాలు పెంచుకునేందుకు ప్రయత్నిస్తారు. కానీ సీనియర్ రాజకీయ నాయకుడైన బొత్స సత్యనారాయణగానీ, రెండుసార్లు ఎంపీగా పనిచేసిన ఝాన్సీలక్ష్మి గానీ ఆ దిశగా ఇంతవరకూ ప్రయత్నించిన దాఖలాల్లేవని పార్టీ నేతలే పేర్కొంటున్నారు. మంత్రి బొత్సను ఝాన్సీలక్ష్మి ఎప్పటి నుంచి ప్రచారం ప్రారంభిస్తారని అడిగితే... 'తొందరెందుకు...మీరు ... మిగతా 6వ పేజీలో

ప్రధాని విశాఖ పర్యటన రద్దు



విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ విశాఖ పర్యటన రద్దయ్యింది. ఈ మేరకు ఆయన కార్యాలయం నుంచి జిల్లా యంత్రాంగానికి సమాచారం వచ్చింది. నగరంలోని హెచ్‌పీసీఎల్ విస్తరణ పనులు పూర్తికావడంతో జాతికి అంకితం చేసేందుకు మార్చి ఒకటో తేదీన ప్రధాని వస్తున్నట్టు అధికారులు గతంలో ప్రకటించారు. ఈ సందర్భంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ప్రధాని పర్యటన రద్దు అయినట్టు శనివారం సమాచారం అందింది.

నేడు గ్రూప్-2 పరీక్ష

- 105 కేంద్రాలు: 47,491మంది అభ్యర్థులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 రాత పరీక్ష ఆదివారం ఉదయం జరగనున్నది. నగరంలో మొత్తం 105 కేంద్రాల్లో 47,491 మంది పరీక్షకు హాజరవుతున్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరగనున్నది. అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రాలకు రావల్సి ఉంటుంది. పరీక్ష హాలులోకి ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్ ఫోన్లు, పుస్తకాలను అనుమతించరు. కాగా పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశా మని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు.

విమ్స్‌లో అంకాలజీ, న్యూరాలజీ సేవలు


డాక్టర్ కె.రాంబాబు

ఆరిలోవ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో కేన్సర్, బ్రెయిన్ స్ట్రోక్ విభాగాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ రెండు విభాగాలను శనివారం ఉదయం విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగా మెడికల్ అంకాలజీ, సర్జికల్ అంకాలజీ, న్యూరాలజీ విభాగాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. కేన్సర్ రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు సర్జికల్ అంకాలజీకి ఇద్దరు, మెడికల్ అంకాలజీకి ఇద్దరు వైద్యులను నియమించామన్నారు. అధిక ఒత్తిడి కారణంగా బ్రెయిన్ స్ట్రోక్ బారినపడిన రోగులకు రూ.50 వేలు విలువజేసే ఇంజెక్షన్‌ను ఉచితంగా ఇవ్వనున్నట్టు డైరెక్టర్ తెలిపారు. స్ట్రోక్ వచ్చిన మూడు నుంచి నాలుగు గంటల వ్యవధిలో ఈ ఇంజెక్షన్ తీసుకుంటే వేగంగా కోలుకుంటారని ఆయన స్పష్టంచేశారు. త్వరలో ఆస్పత్రిలో మరిన్ని విభాగాలను ఏర్పాటు చేస్తామన్నారు.

28న మెగా జాబ్‌మేళా

కంచరపాలెం, ఫిబ్రవరి 24: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల్లో ఈనెల 28వ తేదీ బుధవారం మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ పేర్కొన్నారు.బోర్డు ఆఫ్ అప్రంటీస్‌షిప్ ట్రైనింగ్(బోట్), సదరన్ రీజన్ ,ఆంధ్రప్రదేశ్ సాంకేతి విద్యాశాఖ కమిషనరేట్ వారు సంయుక్తంగా ఈ మెగాజాబ్ మేళాను నిర్వహించనున్నారన్నారు. ప్రముఖ ప్రభుత్వ సంస్థలతోపాటు ప్రైవేటు కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు, డిప్లొమా హోల్డర్లుతో పాటు నాన్ ఇంజినీరింగ్ కోర్సులు బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ తదితర కోర్సులు పూర్తిచేసిన యువత ఈ మేళాలో పాల్గొనవచ్చు. ఉద్యోగ,అప్రంటీస్ శిక్షణ కోసం నిరుద్యోగులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోజు ఉదయం 9.30 గంటల నుంచి సాయంకాలం 4.30 గంటల వరకు జాబ్‌మేళా కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల,కంచరపాలెంలో నిర్వహించనున్నామన్నారు. అభ్యర్థులు అన్నీ ధ్రువపత్రాలు,మూడు సెట్స్ బయోడేటాతో హాజరుకావాలని రమణ కోరారు.

నిరాశ్రయురాలికి వివాహం

దొండపర్తి, ఫిబ్రవరి 24: టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూ టీడీ నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న అనిత (20)కి శనివారం వివాహం జరిపించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ శ్రీనివాస్ తెలిపారు. అనిత తొమ్మిదేళ్ల వయస్సులోనే తల్లిదండ్రులు మృతి చెందారు. పాపా హోం, స్వధార్ హోంలలో ఉంటూ ఇంటర్మీడియట్ వరకు చదువుకుంది. ఆమె మేజర్ కాడంతో స్వధార్ ప్రతినిధులు ఏయూటీడీ షెల్టర్‌కు అప్పగించారు. గతంలో ఏయూటీడీ షెల్టర్‌లో ఉంటూ ఉపాధి పొందిన ఖాదర్(24) అనే యువకుడు ముందుకు వచ్చాడు. దీంతో ఇరువురి అభీష్టం మేరకు వసతి గృహంలో వివాహం జరిపించారు.



స్టాల్స్‌లో ప్లాస్టర్లు అంటించి తాళ్లతో కట్టి ఉన్న విద్యుత్ స్విచ్ బోర్డులు



పనిచేయని ధరలు తెలియజేసే డిజిటల్ బోర్డు

పొంచి ఉన్న ప్రమాదం

- రైతు బజారు స్టాల్స్‌లో వేలాడుతున్న విద్యుత్ స్విచ్‌బోర్డులు
- పనిచేయని డిజిటల్ ధరల బోర్డు

మర్రిపాలెం, ఫిబ్రవరి 24: స్థానిక రైతుబజార్‌లోని పలుస్టాల్స్‌లో విద్యుత్ స్విచ్ బోర్డులు ప్రమాదకరంగా మారాయి. స్టాల్స్ పైభాగంలో ఏర్పాటు చేసిన బోర్డులు కిందకు వేలాడుతూ, వాటికి ప్లాస్టర్లు అంటించడంతోపాటు తాళ్లను కట్టారు. పలుచోట్ల ఇదే పరిస్థితి ఉండటంతో ఈ స్టాల్స్‌లో విక్రయాలు సాగిస్తున్న రైతులు భయాందోళనలు చెందుతున్నారు. ఏమరుపాటుగా నిల్చుని స్విచ్‌బోర్డులు తాకినట్లయితే, ప్రమాదం బారినపడే అవకాశం ఉందని ఆవేదనవ్యక్తంచేస్తున్నారు. చాలా రోజులుగా ఈసమస్య ఉన్నా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కూరగాయల ధరలు తెలియజేసే డిజిటల్ బోర్డు సుమారు నాలుగేళ్లుగా పని పనిచేయలేదు. మరమ్మతులు చేపట్టకపోవడంతో రైతుబజార్‌కు వచ్చే వినియోగదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు కూరగాయల ధరల డిజిటల్ బోర్డు, స్విచ్ బోర్డులు మార్చాలని పలువురు కోరుతున్నారు.

వైసీపీ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభం

- జనసేన పార్టీ 'ఉత్తర' ఇన్‌చార్జి ఉషాకిరణ్



ప్రచారంలో ఉషాకిరణ్, నాయకులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 24 : ఒంటెద్దు పోకడలతో పరిపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని ఉత్తర నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ అన్నారు.జనంలోకి జనసేన కార్యక్రమంలో భాగంగా 26వవార్డు పార్టీ అధ్యక్షుడు బండి కనకరాజు, మహిళా అధ్యక్షురాలు బోడసింగి విజయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం లలితానగర్‌లో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనసేన. టీడీపీ పార్టీల ఉమ్మడిగా ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. అందు కోసం ఇరుపార్టీల అభ్యర్థులను ఓటు వేసి గెలిపించాలని కోరారు. 60 రోజుల్లో జనసేన, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రానుందన్నారు. రాజధానిలేని ఏపీని అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. నాయకులు కె. బాలాజీ, శ్రీనివాసులు, రాజు, జి. సంపత్,ఎం.సాయి, వార్డు టీడీపీ అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

యాదవ సంఘ భవనానికి నేడు శంకుస్థాపన

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 24: యాదవ సంఘ సామాజిక భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఎండాడ దిశ పోలీస్‌స్టేషన్ వద్ద కేటాయించిన స్థలం వద్ద ఆదివారం భూమి పూజ చేయనున్నట్టు నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి తెలిపారు. శనివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సామాజికి భవనానికి 5 సెంట్ల స్థలాన్ని కేటాయించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ హాల్ నిర్మాణానికి వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి ఆదివారం భూమి పూజ చేస్తారన్నారు. గొలగాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మొల్లి అప్పారావు, పల్లా దుర్గారావు, సారిపల్లి గోవింద్, యువ్వల లక్ష్మీసురేశ్, పీతల గోవింద్, రవికుమార్, మన్యాల శ్రీనివాస్, పీతల వాసు పాల్గొన్నారు.

ఆలోచించి ఓటు వేయాలి: బీజేపీ

కంచరపాలెం, ఫిబ్రవరి 24: మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు శనివారం 47వార్డు పరిధి కప్పరాడ ప్రాంతంలో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. వైసీపీ పాలనపై విమర్శలు చేశారు. ఉత్తర బీజేపీ కన్వీనర్ సురేష్‌బాబు, ఆర్.రాంబాబు, జి.అరుణ్ తదితరులున్నారు.

ఎన్నికల హామీలు అమలు చేసే పార్టీలపైనే విశ్వాసం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు.. వేదికపై గండి బాబ్జీ, శ్రీభరత్

మహారాణిపేట, ఫిబ్రవరి 24: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసిన పార్టీలపైన ప్రజల్లో విశ్వాసం పెంపొందుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ అనుబంధంగా ఉన్న ప్రొఫెషనల్ వింగ్ ఆధ్వర్యంలో శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన టౌన్‌హాల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు హయాంలో ఆర్థిక కార్యకలాపాలు గాడిలో పెట్టేందుకు తీసుకువచ్చిన సీఎఫ్ఎంఎస్ ప్రస్తుత ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. జీవీఎంసీ నిధులను సైతం రాష్ట్రం తీసుకుంటుందన్నారు. త్వరలో ఏర్పాటుకానున్న టీడీపీ, జనసేన ప్రభుత్వం సీఎఫ్ఎంఎస్‌లో తప్పులను సవరిస్తామన్నారు. టీడీపీ విశాఖ పార్లమెంటు ఇన్‌చార్జి ఎం. శ్రీభరత్ మాట్లాడుతూ ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. విశాఖ ప్రజలకు మాత్రం తాను ఎప్పుడు అందుబాటులో ఉంటానని, నగర అభివృద్ధిపై దృష్టిసారిస్తానన్నారు. విశాఖ దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ మాట్లాడుతూ విశాఖ పోర్టు కాలుష్యం లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం చూపిందని ఆరోపించారు. భీమిలి టీడీపీ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు మాట్లాడుతూ ప్రభుత్వానికి ఆదాయ మార్గాలు లేనందునే చెత్తపై పన్నులు వేస్తున్నారన్నారు. సమావేశానికి ప్రొఫెషనల్ వింగ్ రాష్ట్ర అధ్యక్షురాలు పి. తేజస్విని, ఉత్తరాంధ్ర అధ్యక్షుడు ఆవాల సతీశ్, రాజు పాల్గొన్నారు.

ముగిసిన లలిత పీఠం వార్షికోత్సవాలు



అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 24 : గ్రేటర్ 26వ వార్డు లలితానగర్‌లోని లలితాపీఠం 75వ వార్షికోత్సవాల్లో భాగంగా ఐదురోజుల పాటు నిర్వహించిన అమృతోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ మేరకు లలితాదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై ఊరేగించారు. మేళతాళాలు, కోలాటం, తప్పెటగుళ్ళు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య ఈవేడుక కనుల పండువగా సాగింది. ఈ గ్రామోత్సవంలో గుర్రపురథంపై పీఠాధిపతి సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి, ఓపెన్ కారుపై శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యా నంద భారతీ స్వామి పర్యటించారు. ఈ కార్యక్రమంలో కుర్తాళం పురోహితులుమాచవోలు రమేశ్ శర్మ, లలితాపీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్, నిర్వాహక కార్యదర్శి వెంపరాల నరసింహమూర్తి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పీఎల్ఎన్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్, ఫిబ్రవరి 24 ; మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రముఖ ఈఎన్‌టీ వైద్యురాలు కె.జె.ప్రియాంక రోగులకు వైద్య పరీక్షలు చేశారు. చెవి, ముక్కు, గొంతు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మానసిక సమస్యలు, బీపీ, షుగర్ తదతర వైద్య పరీక్షలను టి.స్వప్న, సుస్మిత వైద్య బృందం చేపట్టింది. శిబిరాన్ని వాకర్స్‌క్లబ్ అధ్యక్షులు పల్లా.చంద్రమౌళి పర్యవేక్షించారు. . కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షులు బుచ్చయ్య, సత్యనాథం, ఉపాధ్యక్షులు ఏవీ సుబ్బారావు, కోశాధికారి జె. కూర్మారావు, కార్యదర్శి పి.చెల్వరాజు తదితరులు ఉన్నారు. 200 మందికి వైద్య సేవలను వినియోగించుకున్నారు.

'సమస్యలపై న్యాయవాదుల ఉద్యమం'



మాట్లాడుతున్న శాంతకుమార్

సీతమ్మధార, ఫిబ్రవరి 24 : తమ డిమాండ్ల సాధనకు రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి న్యాయవాదులు సిద్ధమవుతున్నారు. దీనిలో భాగంగా ద్వారకానగర్‌పౌరగ్రంథాలయంలో ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శాంతకుమార్ మాట్లాడుతూ అడ్వకేట్ వెల్ఫేర్ ఫండ్, డెత్ బెనిఫిట్ ఫండ్ రూ.10 లక్షలకు పెంచాలని, 35 ఏళ్ల నుంచి బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్న న్యాయవాదులకు అడ్వకేట్ వెల్ఫేర్ ఫండ్ సౌకర్యం కల్పించాలని, మృతి చెందిన న్యాయవాదులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మ్యాచింగ్ గ్రాంట్ రూ.4 లక్షలు ఆయా కుటుంబాలకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు.

ఘనంగా సైన్స్ ఎక్స్‌పో



ఈ రవీంద్ర భారతిలో నమూనాల ప్రదర్శన

సీతమ్మధార, ఫిబ్రవరి 24 : ద్వారకానగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో సైన్స్ ఎక్స్‌పో సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏయూ బయో కెమిస్ట్రీ ప్రొఫెసర్ రవికుమార్ మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన నమూనాలు ప్రదర్శించడానికి ఇలాంటి సైన్స్ ఎక్స్‌పోలు దోహదపడుతాయన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతో పాటు, అధ్యయనం చేయడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. పలు ప్రాజెక్టులు రూపకల్పనతో సహ విద్యార్థులు భాగస్వామ్యం కావాలనే ఉత్సాహం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ బయో కెమిస్ట్రీ హెచ్‌వోడీ సుభాషిణి దేవి, సంస్థ నార్త్ ఆంధ్ర జోనల్ ఇన్‌చార్జి ఎన్. వెంకటేష్, ప్రిన్సిపాల్ పుష్పలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బీఎస్పీ మరింత బలోపేతం'



మాజీ డీజీపీ పూర్ణచంద్రరావును అభినందిస్తున్న నాయకులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 24: విశ్రాంత ఐపీఎస్ అధికారి, మాజీ డీజీపీ జె.పూర్ణచంద్రరావు బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా చేరడంతో పార్టీ మరింత పటిష్టమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కదిరి రాము అన్నారు. ఈ మేరకు ఆయనను రాష్ట్ర కార్యాలయంలో కలిసి అభినందించారు. పూర్ణచంద్రరావుసేవలు సేవలు ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా ఆయనను అభినందించారు. ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి, కరణం తిరుపతిరావు, విశ్రాంత జడ్జి గుర్రప్ప, పెదపెంకి శివప్రసాదరావు, బోని కృష్ణ, దివకాల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

హిందూ వివాహ పద్ధతి అన్వయానికే ఉమ్మడి పౌరస్మృతి

- సుప్రీంకోర్టు న్యాయవాది కీర్తిసింగ్



మాట్లాడుతున్న కీర్తి సింగ్

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 24: హిందూ వివాహ పద్ధతి ముస్లింలకు అన్వయించడానికి ఉమ్మడి పౌరస్మృతి తీసుకువస్తున్నారని సుప్రీంకోర్టు న్యాయవాది కీర్తిసింగ్ అన్నారు. ఐద్వా అఖిల భారత మహాసభల్లో భాగంగా సుశీల గోపాలన్ ట్రస్ట్ శనివారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'ఉమ్మడి పౌరస్మృతి'పై నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సివిల్ మ్యాటర్స్‌లో ఎవరి చట్టం వారికి ఉంటుందన్నారు. హిందూ వివాహ వ్యవస్థలో సైతం వివిధ రకాల సంస్కృతి, సంప్రదాయాలుంటాయన్నారు. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో వివాహమైన మహిళలకు వారసత్వ ఆస్తి పొందే హక్కు లేదన్నారు. వీటన్నింటిపై మహిళా సంఘాలు ఉద్యమించాలన్నారు. ఈ సమావేశంలో ఐద్వా ఆలిండియా అధ్యక్ష, కార్యదర్శులు పీకే శ్రీమతి, మరియం దావలే, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రభావతి, రమాదేవి పాల్గొన్నారు.

'దేశం' తొలి జాబితాలో ఇద్దరికి చోటు

... 5వ పేజీ తరువాయి

ఎన్నికల్లో పెందుర్తి నుంచి అసెంబ్లీకి పోటీ చేసి విజయం సాధించారు. అయితే 2004లో టీడీపీ నుంచి పోటీ చేసేందుకు అవకాశం లభించలేదు. 2009లో ప్రజారాజ్యంలో చేరి, కొత్తగా ఏర్పడిన విశాఖ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. రాష్ట్ర విభజన తరువాత 2014లో తిరిగి టీడీపీలో చేరి విశాఖ పశ్చిమ నుంచి విజయం సాధించిన గణబాబు 2017 నుంచి 2019 వరకు ప్రభుత్వ విప్‌గా కొనసాగారు. తిరిగి 2019లో విశాఖ పశ్చిమ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. నియోజకవర్గంలో ప్రత్యామ్నాయం లేకపోవడం, నగరంలో బలమైన గవర సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో అధిష్ఠానం గణబాబుకు మరోసారి అవకాశం ఇచ్చింది. విశాఖ జిల్లాలో మిగిలిన ఐదు సీట్లకు సంబంధించి టీడీపీ, జనసేన మధ్య ఇంకా స్పష్టత రాకపోవడంతో అభ్యర్థులను ప్రకటించలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

పోటీపై బొత్స ఝూన్సీ సందిగ్ధం?

... 5వ పేజీ తరువాయి

ఎప్పుడంటే అప్పుడని' చెప్పి సమాధానం దాటవేసేస్తున్నారు. ఇదిలావుండగా గత ఎన్నికల్లో అంతటి వైసీపీ ప్రభంజనంలో కూడా నగరంలోని నాలుగు అసెంబ్లీ స్థానాల్లోనూ టీడీపీ అభ్యర్థులే గెలుపొందారు. ఇప్పుడు పరిస్థితి మరింత ఘోరంగా ఉందని, వైసీపీకి పరిస్థితులు ఏమాత్రం సానుకూలంగా లేవని పలు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో విశాఖ నుంచి ఎంపీ అభ్యర్థిగా తన భార్యను పోటీకి దింపడంపై బొత్స సత్యనారాయణ సందిగ్ధంలో ఉన్నట్టు పార్టీలో ప్రచారం జరుగుతోంది. ఎన్నికలకు మరో 50 రోజులు కూడా గడువులేదని, అయినా ఎంపీగా పోటీకి దిగేది ఎవరో తెలియని అయోమయ స్థితిలో ఉన్నామని అధికార పార్టీ నేతలు, కార్యకర్తలు వాపోతున్నారు.

అమృత్ భారత్ స్టేషన్లకు రూ.1029.87 కోట్లు

... 5వ పేజీ తరువాయి

కొత్తవలస, రూ.21 కోట్లతో చీపురుపల్లి, రూ.23 కోట్లతో శ్రీకాకుళం రోడ్డు, రూ.19 కోట్లతో నౌపడ జంక్షన్, రూ.12 కోట్లతో పర్లాకిమిడి, రూ.16 కోట్లతో బొబ్బిలి జంక్షన్, రూ.14.76 కోట్లతో పార్వతీపురం, రూ.17.94 కోట్లతో జైపూర్, 21.20 కోట్లతో కోరాపుట్ జంక్షన్ స్టేషన్లను అభివృద్ధి చేయనున్నామన్నారు. కాగా విశాఖ స్టేషన్ అభివృద్ధి నిర్మాణ పనులకు రూ.492.64 కోట్లు కేటాయించగా, తర్వాత అత్యధికంగా రూ.243 కోట్ల వ్యయంతో రాయగడ స్టేషన్‌లో అభివృద్ధి నిర్మాణ పనులు చేపట్టనున్నామన్నారు. కాగా రూ.600 కోట్ల వ్యయంతో విశాఖ, దువ్వాడ, విజయనగరం, దామన్‌జోడి, జగదల్‌పూర్ స్టేషన్ల అభివృద్ధి పనులకు సంబంధించి ప్రధాని నరేంద్రమోదీ ఇటీవల శంకుస్థాపన చేశారన్నారు. వీటి నిర్మాణ పనులు దాదాపు చివరి దశకు చేరాయని తెలిపారు. ఈ సమావేశంలో ఏడీఆర్ఎం సుధీర్‌కుమార్ గుప్తాతో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాఘవేంద్రరావు సేవలు ప్రశంసనీయం



చలసాని రాఘవేంద్రరావును సన్మానిస్తున్న పలువురు వక్తలు

సిరిపురం, ఫిబ్రవరి 24: నాఫ్ కాబ్ డైరెక్టర్‌గా విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు ఎన్నికవడంతో బ్యాంకు ప్రతిష్ఠ ఇనుమడించిందని వక్తలు పేర్కొన్నారు సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో శనివారం రాత్రి విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అభినందన సభ సంస్థ డైరెక్టర్ చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాఘవేంద్రరావు సారథ్యంలో బ్యాంకులో సాంకేతిక సేవలు ప్రవేశపెట్టారన్నారు. రాఘవేంద్రరావు మాట్లాడుతూ తనకు జరిగిన సన్మానం అర్బన్ బ్యాంకులు ,క్రెడిట్ సొసైటీల జాతీయ సమాఖ్యకు చెందుతుందన్నారు. బ్యాంకు గౌరవ విశ్రాంత ఛైర్మన్ మానం ఆంజనేయులు, డైరెక్టర్స్ గుడివాడ భాస్కరరావు, సూర్యనేని నాగభూషణ చౌదరి, అప్పారి జోసెఫ్ స్టాలిన్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

- పరీక్షల ప్రత్యేక అధికారి బి.రాధ

మద్దిలపాలెం, ఫిబ్రవరి 24: జిల్లాలో ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు సజావుగా నిర్వహించాలని పరీక్షల ప్రత్యేక అధికారి బి.రాధ సూచించారు. బుల్లయ్య కళాశాలలో పరీక్షల సిబ్బందితో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వచ్చే నెల ఒకటో తేది నుంచి జరగనున్న పరీక్షలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకూడదన్నారు. అనంతరం జిల్లాలోని 93 పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, స్క్వాడ్ బృందాలు, కస్టోడియన్స్‌కు విధులు వివరించారు. ఈ సమావేశంలో ఆర్ఐవో పి.మురళీధర్, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌జీజీఓస్ కాలనీ హైస్కూల్‌లో గ్రూప్-2 పరీక్షకు ఏర్పాట్లు



ఎన్‌జీజీఓస్ కాలనీలోని పరీక్ష కేంద్రం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 24: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-2 పరీక్ష శనివారంజరగనుంది. గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలను పరీక్ష కేంద్రంగా (కోడ్ నెంబరు 1105070) ఎంపికచేసినట్టు సూపరింటెండెంట్ బి. లక్ష్మీ నరస తెలిపారు. ఈ కేంద్రంలో 200 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు చెప్పారు. ఉదయం 10-30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులంతా ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్షకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే అభ్యర్థులు ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, కాలిక్యులేటర్లు, సెల్‌ఫోన్లు తీసుకు రాకూడదని తెలిపారు.

అభ్యర్థులు అప్రమత్తం

గ్రూప్-2 పరీక్ష రాసే అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ అన్నారు. 889 ఉద్యోగాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4,83,525 అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అర గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు చేరుకోవాలని సూచించారు. నెగిటివ్ మార్కుల విషయంలో జాగ్రత్తగా ఆలోచించి మల్టిపుల్ చాయిస్ జంబ్లింగ్ చేయాలన్నారు. మూడు తప్పులకు ఒక మార్కు కోల్పోతారని హెచ్చరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



47వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న కేకే రాజు

కంచరపాలెం, ఫిబ్రవరి 24 : జీవీఎంసీ 47వ వార్డు పరిధిలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను వార్డు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి ఆధ్వర్యంలో ఉత్తర వైసీపీ నాయకుడు కె.కె.రాజు పాల్గొని శంకుస్థాపనలు చేశారు. సంజీవయ్యకాలనీ, కప్పరాడ, అరుంధతీనగర్, బాపూజీ నగర్ తదితర గ్రామాల్లో .నూతన సామాజిక భవనాల నిర్మాణం, రోడ్లు, కాలువలు, రిటర్నింగ్ వాల్స్ తదితర పనుల కోసం రూ. కోటి 25లక్షలు నిధులను కేటాయించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కోరిబిల్లి విజయ్, గురువోజీ, వసంతల అప్పారావు, ఏఈ చాణక్య పాల్గొన్నారు.

ఆలయ షెడ్ నిర్మాణానికి..

సీతమ్మధార: గ్రేటర్ 24వవార్డు రేసపువాని పాలెం శాంతి స్వరూపిణి అమ్మవారు ఆలయం వద్ద కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో రూ.16.50 లక్షల వ్యయంతో నూతన షెడ్ నిర్మాణానికి కేకేరాజు శనివారం శంకుస్థాపన చేశారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్ధార్థనగర్‌ను వీడని 22-ఏ సమస్య


సిద్ధార్థనగర్ వ్యూ..

మూడున్నర దశాబ్దాలుగా ఇళ్ల క్రయ విక్రయాలకు నోచుకోని వైనం

అత్యవసరాలకు విక్రయించడానికి వీల్లేకుండా పోతుందని కాలనీవాసుల ఆవేదన

ఇప్పటికైనా అధికారులు క్రమబద్ధీకరణ చేయాలని విజ్ఞప్తి

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 24: మహా విశాఖ నగరపాక సంస్థ (జీవీఎంసీ) 87వ వార్డు పరిధి కణితి కాళింగుల వీధి సమీపంలోని సిద్ధార్థనగర్ కాలనీని 22-ఏ సమస్య మూడున్నర దశాబ్దాలుగా వేధిస్తోంది. 1987లో బీహెచ్‌పీవీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు కొందరు తమకు ఇళ్ల స్థలాలను కేటాయించవలసిందిగా నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డిని వేడుకున్నారు. దీంతో వడ్లపూడి సర్వే నంబర్-1 పార్టు-5లోని రాతి చెరువులో తొమ్మిది ఎకరాల స్థలాన్ని ప్రభుత్వ ధరకు వాళ్లకు కేటాయించారు. బీహెచ్‌పీవీలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యోగులంతా బీహెచ్‌పీవీ ఎంప్లాయీస్ హౌసింగ్ సొసైటీని ఏర్పాటు చేసుకున్నారు. వీరంతా తొమ్మిది ఎకరాలకు గాను రూ.రెండు లక్షల 80 వేలు చెల్లించి సొసైటీ పేరున స్థలాన్ని కేటాయింపు చేయించుకున్నారు. ఈ సొసైటీలో 350 మంది సభ్యులుండగా 272 మందికి మాత్రమే ప్లాట్లు కేటాయించారు. వీరిలో చాలామంది ఇళ్లు నిర్మించుకోగా, మిగతా 78 మంది ఆ పక్కనే ఉన్న సర్వే నంబర్-1 పార్టు-6లో ఉన్న ఐదెకరాల స్థలాన్ని కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆ స్థలంలో వాటర్ ట్యాంకును కూడా నిర్మించారు. అయితే ఆ కేటాయింపు ఇప్పటివరకు జరగకుండా పెండింగ్‌లోనే ఉండిపోయింది.


సర్వే నంబర్-1 పార్టు-6లో నిర్మించిన వాటర్ ట్యాంక్

22-ఏ జాబితాలో..

కాగా సొసైటీకి కేటాయించిన మొత్తం స్థలాన్ని ప్రభుత్వ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా (22-ఏ జాబితాలో) ఉన్నట్టు చూపుతున్నారు. ఈ కారణంగా ఈ కాలనీలో నిర్మించుకున్న ప్లాట్ల క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. ఇళ్ల పునర్నిర్మాణం కోసం గానీ ఆధునీకరణకు కానీ జీవీఎంసీ అనుమతులు ఇవ్వడం లేదు. బ్యాంకులు లోన్‌లు మంజూరు చేయడం లేదు. పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఇతర అత్యవసరాలకు తమ ప్లాట్లు, ఇళ్లను అమ్ముకుందామన్నా వీలుపడడం లేదని పలువురు సొసైటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు పరిశీలించినప్పటికీ..

సిద్ధార్థనగర్‌లో ప్లాట్ల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆధ్వర్యంలో గతంలో కాలనీవాసులు జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. జేసీ ఆదేశాల మేరకు పలుమార్లు తహసీల్దార్ సిద్ధార్థనగర్ కాలనీని సందర్శించి పరిశీలించిన్పటికీ ఆ తర్వాత ప్రక్రియ ముందుకు సాగలేదని పలువురు పేర్కొంటున్నారు.

అవసరాలకు అమ్ముకోలేకపోతున్నాం..



ఇప్పటికే సిద్ధార్థనగర్ కాలనీలో చాలా భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో అవసరాల నిమిత్తం తమ ప్లాట్లు, ఇళ్లను అమ్ముకుందామన్నా.. ఆధునీకరించాలన్నా జీవీఎంసీ అనుమతులు, ప్లాన్ అప్రూవల్స్, బ్యాంకు రుణాలు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో అత్యవసరాల సమయంలో తమ ప్లాట్లు అమ్ముకోలేక అప్పులు చేయాల్సి వస్తుంది. అధికారులు తమ ప్లాట్లను క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని కోరుతున్నాం.

-జేఎన్ మూర్తి, సొసైటీ సభ్యుడు

అధికారులు స్పందించాలి



మూడున్నర దశాబ్దాలుగా తమ కాలనీని 22-ఏ సమస్య పట్టి పీడిస్తోంది. సొసైటీకి కేటాయించిన స్థలాన్ని ఇప్పటికీ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా 22-ఏ జాబితాలో ఉన్నట్టు చూపడం బాధాకరం. దీనివల్ల పిల్లల పెళ్లిళ్లు, చదువులు, తదితర అత్యవసరాలకు ప్లాట్లను విక్రయించుకునే అవకాశమే లేకుండా పోయింది. అందువల్ల అధికారులపై ఎమ్మెల్యే తీసుకువచ్చి ఈ సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నాం.

-బలిరెడ్డి నాగేశ్వరరావు, సిద్ధార్థనగర్ కాలనీ అధ్యక్షుడు


రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్న దృశ్యం.. పక్కన గాయపడిన డ్రైవర్

ఉక్కు సెక్టార్-8లో రెండు బస్సులు ఢీ

ఎనిమిది మందికి స్వల్ప గాయాలు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 24: స్టీల్‌ప్లాంట్ సెక్టార్-8 మలుపు వద్ద శనివారం ఉదయం రెండు బస్సులు ఢీకొన్నాయి. ఇక్కడి మలుపు వద్ద రెండు బస్సులు ఎదురెదురుగా ఒకేసారి రావడంతో ప్రమాదం చోటుచేసుకుంది. దేశపాత్రునిపాలెం నుంచి కణితి జంక్షన్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు, అదే మార్గంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీని ఢీకొనడంతో ఆయా డ్రైవర్లతో సహా ఎనిమిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, బస్సులను అక్కడ నుంచి తరలించారు.

వైసీపీ పాలనకు అంతం పలకాలి

బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, ఫిబ్రవరి 24: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం దుర్మార్గ పాలనను సాగిస్తోందని, దీనిని అంతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు కోరారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ కూటమి విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. పాతగాజువాకలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఏ ఒక్క అభివృద్ధి జరగలేదన్నారు. కేంద్ర పథకాలను తమవిగా రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంటుండడం శోచనీయమన్నారు. ఈ సమావేశంలో నాయకులు బాటా శ్రీను, బొండా ఎల్లాజీరావు, రోహిణి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు గణబాబు కృతజ్ఞతలు

గోపాలపట్నం, ఫిబ్రవరి 24: తెలుగుదేశం పార్టీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా తనను చంద్రబాబునాయుడు నియమించడం పట్ల ఎమ్మెల్యే గణబాబు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనకు మరోసారి అవకాశం కల్పించిన టీడీపీ అధినేత చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలపై పోరాడడానికి పార్టీ అధిష్ఠానం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నానని పేర్కొన్నారు.

జెడ్సీని కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

గాజువాక, ఫిబ్రవరి 24: గాజువాక జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన బి.సన్యాసినాయుడును కాంగ్రెస్ పార్టీ గాజువాక నియోజకవర్గ నాయకులు శనివారం కలిసి అభినందనలు తెలిపారు. జోనల్ పరిధిలో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు. జోనల్ పరిధిలో అభివృద్ధి పనులకు సహకరిస్తామని పేర్కొన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో నాయకులు గవర వెంకటరమణ, ఉరుకూటి అచ్చిబాబు, ఆస్మత్ అలీ, శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

గంగవరంలో ముగిసిన క్రీడా పోటీలు

పెదగంట్యాడ, ఫిబ్రవరి 24: మాఘపౌర్ణమిని పురస్కరించుకుని గంగవరం సీడబ్ల్యూసీ మూడు రోజుల పాటు నిర్వహించిన క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సీడబ్ల్యూసీ ఆవరణలో జరిగిన కార్యక్రమానికి స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కేఎస్ఎన్ రావు, ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ ముఖ్యఅతిథులుగా హాజరై క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన సెవెన్ స్టార్ జట్టు సభ్యులకు జ్ఞాపికలు అందజేశారు. అనంతరం ఆదినారాయణ మాట్లాడుతూ మాఘపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్ కార్యదర్శి పేర్ల సత్యారావు, కోశాధికారి కె.పోతన్న, ట్రేడ్ యూనియన్ నాయకులు చీకటి శ్రీనివాస్, మోహన్‌బాబు, శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి పాశర్ల ప్రసాద్ రాజీనామా

సింహాచలం, ఫిబ్రవరి 24: టీడీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేర కు శనివారం సోషల్ మీడియాలో ఒక ప్రకటన చేశారు. పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీకి అవకాశం ఇవ్వాలని కోరానని, అధినేత చంద్రబాబు ప్రకటించిన జాబితాను చూసిన తరువాత రాజీనామా నిర్ణయానికి వచ్చానన్నారు. సుమారు నాలుగు దశాబ్దాల పాటు పార్టీకి తాను చేసిన సేవలను గుర్తించపోవడంతో ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.

బ్రహ్మకుమారీస్ పాఠశాల ప్రారంభం

అగనంపూడి, ఫిబ్రవరి 24: ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బ్రహ్మకుమారీస్ సంస్థ అగనంపూడి శాఖ ఆధ్వర్యంలో శనివారం దానబోయిన పాలెంలో బ్రహ్మకుమారీస్ పాఠశాలను మౌంట్ అబూ నుంచి విచ్చేసిన దిల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ మానసిక ప్రశాంతత అవసరమన్నారు. ఈ పాఠశాలలో ఉచితంగా రాజయోగ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సోమేశ్వరి, రామకోటి, బలిరెడ్డి సత్యనారాయణ, రాజు, కె.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు జె.అయోధ్యరామ్

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 24: ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, లేకుంటే సెయిల్‌లో విలీనం చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల శిబిరంలో శనివారం ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ మార్చి ఒకటిన విశాఖ వస్తున్నందున అన్ని రాజకీయ పార్టీలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై ఆయనపై ఒత్తిడి తేవాలన్నారు. ఆదివారం ఉక్కు నిర్వాసిత కాలనీల్లో పాదయాత్రలు చేపట్టనున్నామని, 27న కూర్మన్నపాలెం దీక్షల శిబిరం నుంచి జీవీఎంసీ ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షల శిబిరం వరకూ పాదయాత్ర చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉక్కు నిర్వాసితులు, ఉద్యోగులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, కేఎస్ఎన్ రావు, వరసాల శ్రీనివాసరావు, నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, పరంధామయ్య, సింహాద్రి, దొమ్మేటి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివరామకృష్ణ ఆలయ వార్షికోత్సవం

పెదగంట్యాడ, ఫిబ్రవరి 24: జీవీఎంసీ 75వ వార్డు పరిధి సీతానగరం శివరామకృష్ణ ఆలయ వార్షికోత్సవాన్ని గ్రామాభ్యుదయ సేవా సంఘం శనివారం ఘనంగా నిర్వహించింది. ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకం చేశాక పుష్పాలతో అలంకరించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో కోలాటం, గారడీ, తప్పెటగుళ్ల కళాకారుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, గ్రామాభ్యుదయ సేవా సంఘం అధ్యక్షుడు ఎస్.దుర్గబాబు, కార్యదర్శి పి.హరి, టీడీపీ వార్డు అధ్యక్షుడు ఎస్.అప్పారావు, సంఘం సభ్యులు ఎస్.వెంకటరమణ, ఎస్.పైడియ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నమూనా ప్రాజెక్టులు

పెందుర్తి-రూరల్, ఫిబ్రవరి 24: సుజాతానగర్‌లో గల రవీంద్ర భారతి పాఠశాలలో శనివారం సైన్స్ ఎక్స్‌పో వేడుకలను ఘనంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన పలు నమూనా ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ మాట్లాడుతూ విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులు ఆలోచింపజేసేలా ఉన్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ఎన్ఎస్‌టీయల్ సైంటిస్టు పి.త్రిమూర్తులు, ఏయూ సీనియర్ ప్రొఫెసర్ సి.మంజులత, స్కూల్ చైర్మన్ ఎంఎస్ మణి, తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న జడ్జి వి.పల్లవి

చట్టాలపై అవగహన పెంచుకోవాలి

మల్కాపురం, ఫిబ్రవరి 24: చట్టాల గురించి విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని అవగహన పెంచుకోవాలని గాజువాక మూడవ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ జడ్జి వి.పల్లవి సూచించారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో శనివారం జరిగిన న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థినులంతా ముఖ్యంగా మహిళా చట్టాలు, తమకున్న హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. వరకట్న నిషేధ చట్టం, వారసత్వ చట్టం, హిందూ వివాహం, నిర్భయ చట్టం, తదితర అంశాల గురించి తెలుసుకోవాలన్నారు. ఏ మహిళా కూడా తన జీవితాన్ని కన్నీటిమయం చేసుకోరాదన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై జెడ్సీకి ఫిర్యాదు

ఎన్.ఎ.డీ జంక్షన్ ఫిబ్రవరి 24: జీవీఎంసీ 90వ వార్డు పరిధి విమాన్‌నగర్ తొమ్మిదో లైన్‌లో చేపడుతున్న అక్రమ నిర్మాణంపై కాలనీవాసులు శనివారం జెడ్సీ కె.హెమావతికి ఫిర్యాదు చేశారు. విమాన్‌నగర్ తొమ్మిదో లైన్‌లో రోడ్డును ఆక్రమించి చేపడుతున్న నిర్మాణంపై గతంలో ఇచ్చిన ఫిర్యాదులు, అప్పుడు టౌన్ ప్లానింగ్ అధికారులు చేపట్టిన చర్యల గురించి వివరించారు. అయితే గత రెండు రోజులుగా మళ్లీ అక్రమంగా నిర్మాణం జరుపుతున్నందున తగిన చర్యలు చేపట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ నిర్మాణాన్ని పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆమె ఆదేశాలు జారీ చేశారు.

సినిమా గైడ్

- **బ్రమయుగం :** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **సుందరం మాస్టర్ :** శారద, శరత్, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ముఖ్య గమనిక :** వెంకటేశ్వర
- **సిద్దార్థ్ రాయ్ :** శ్రీరామ, శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 18, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 24, బెండకాయలు 38, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 48, బీరకాయలు 46, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 26, క్యాబేజీ 22, క్యారెట్ 22, దొండకాయలు 36, బంగాళదుంపలు 20, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 110, మునక్కాడలు (కిలో) 70, బరబాటి 26, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 40, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 210, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 48, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 32, క్యాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 48, చిలగడదుంపలు 28, కంద 60, దేముడుచిక్కుడు 58, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 125
ఫారం ధర	-- 145
విత్ స్కిన్	-- 260
స్కిన్‌లెస్	-- 270

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

స్టీల్‌ప్లాంట్‌లో 600 బయోమెట్రిక్ మిషన్లు

మార్చి ఒకటి నుంచి ప్రారంభించేందుకు సన్నాహాలు

300 సీసీ కెమెరాలు ఏర్పాటు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 24: స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేసేందుకు యాజమాన్యం చర్యలు చేపట్టింది. ఈ మేరకు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తోంది. స్టీల్‌ప్లాంట్‌లో అధికారులు 4,818 (పురుషులు 4,501, మహిళలు 317) మంది, నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు 9,911 (పురుషులు 9726, మహిళలు 185) మంది, కాంట్రాక్టు కార్మికులు 15,524 (పురుషులు 14539, మహిళలు 985) మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరందరికీ బయోమెట్రిక్ హాజరును మార్చి ఒకటో తేదీ నుంచి అమలు చేసేందుకు ఉక్కు యాజమాన్యం సిద్ధమైనట్టు తెలి సింది. స్టీల్‌ప్లాంట్‌లో సుమారు 32 చోట్ల 600 వరకు బయోమెట్రిక్ మిషన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఆయాచోట్ల సుమారు 300 సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేసే పనిలో అధికారులు కాగా బయోమెట్రిక్ హాజరుకు తాము వ్యతిరేకం కాదని, కానీ ప్లాంట్‌లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాక వీటిని అమలు చేయాలని కార్మిక నాయకుడు యెల్లేటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్లాంట్ ప్రగతి కోసం యాజమాన్యం తీసుకుంటున్న చర్యలకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తామన్నారు.


స్టీల్‌ప్లాంట్‌లో ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ మిషన్లు

ఆందోళనలను తీవ్రతరం చేస్తాం..

ఉక్కు పోరాట కమిటీ నాయకులు

అగనంపూడి, ఫిబ్రవరి 24: ఇక్కడి కొండయ్యవలసలోని సీడబ్ల్యూసీ ప్రాంగణంలో అగనంపూడి ప్రాంత ఉక్కు పోరాట కమిటీ నాయకులు శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మార్చి ఒకటిన విశాఖ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఉక్కు పరిరక్షణ పోరాటాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆదివారం స్థానిక కో-ఆపరేటివ్ జంక్షన్ నుంచి ప్రధాన కూడలి వరకు పాదయాత్ర చేయాలని, 26న శనివాడ వేపచెట్టు జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలపాలని తీర్మానించారు. ఈ ఆందోళన కార్యక్రమాల్లో ఉక్కు కార్మికులు, నిర్వాసితులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు శీరంశెట్టి గోవిందరావు, పెదిరెడ్ల నీలకంఠం, పైడిరాజు, ఆట్రా అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉక్కు పరిరక్షణ కమిటీ, నిర్వాసిత సంఘం ఆదివారం పెదగంట్యాడ నిర్వాసిత కాలనీలో చేపట్టనున్న పాదయాత్రను సక్సెస్ చేయాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి కోరారు. స్థానిక సీడబ్ల్యూసీలో నిర్వహించిన వివిధ సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెదగంట్యాడ జంక్షన్ నుంచి పాదయాత్ర ప్రారంభమై అన్ని నిర్వాసిత కాలనీల మీదుగా సాగుతుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీముసిరి శ్రీనివాసరావు, మంత్రి శంకరనారాయణ, చెల్లుబోయిన నాయుడు, కణితి అప్పలరాజు, నెల్లి అప్పలరాజు, నమ్మి రమణ, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు


శ్రీనగర్‌లో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు


ఎస్టీబీఎల్ దివ్యక్షేత్రంలో శాంతి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా మాఘ పౌర్ణమి పూజలు

ఆటోనగర్, ఫిబ్రవరి 24: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని 71వ పరిధి వార్డు శ్రీనగర్‌లోని శ్రీకృష్ణ గోవర్ధనగిరి టెంపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం విజయగణపతి, రమాసత్యనారాయణ స్వామి, శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను జరిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎ.సూర్యనారాయణ, కె.సహదేవరావు, బి.లక్ష్మణరాజు, శ్రీనివాసరాజు, గోవిందరావు, పంచముఖేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. శ్రీవారికి నక్షత్ర హారతులిచ్చి పూజలు, అర్చనలు చేయగా పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

అక్కిరెడ్డిపాలెం: మాఘ పౌర్ణమి సందర్భంగా షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. వేకువ జామున వేద పండితులు శ్రీవారిని పంచామృతాలతో అభిషేకించాక ప్రత్యేక పుష్పాలతో అలంక రించారు. తోమాల సేవ చేసి పూజలు జరిపారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారికి నక్షత్ర హారతులిచ్చి శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. పాలక మండలి సభ్యులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధి వాంబే కాలనీలోని స్వయంభు వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేయగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తులసీమాలలతో సామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం అన్న సమా రాధన చేపట్టారు. పూజల్లో ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల, సింహాచలం దేవస్థానం ట్రస్టీ దొడ్డి రమణ, తదితరులు పాల్గొన్నారు.


వెంకటాద్రి శిఖరంపై శ్రీవారికి పూజలు చేస్తున్న అర్చకుడు

సింహాచలం రైల్వే క్వార్టర్స్‌లో చోరీ

గోపాలపట్నం, ఫిబ్రవరి 24: సింహాచలం నార్త్ రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న ఓ రైల్వే ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగింది. వెస్ట్ క్రైమ్ సబ్ డివిజన్ సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బండలుప్పి కుమార్ అనే రైల్వే ఉద్యోగి కుటుంబ సభ్యులతో పాటు టైప్-2, 80/ఏ రైల్వే క్వార్టర్‌లో నివసిస్తున్నారు. విజయనగరం జిల్లా మక్కువలో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొనడానికి ఇటీవల కుమార్ కుటుంబ సమేతంగా వెళ్లారు. రాగా కుమార్ క్వార్టర్ గొళ్లెం పెకిలించి తలుపులు తెరిచి ఉండడాన్ని సమీప క్వార్టర్‌లో ఉంటున్న వారు గుర్తించి శనివారం సాయంత్రం పోలీసులకు సమాచారం అందజేశారు. ఈ మేరకు ఘటనా స్థలికి పోలీసులు చేరుకుని కుమార్‌కు సమాచారం అందజేశారు. పోలీసులు ఇంట్లోకి వెళ్లి చూడగా చోరీ జరిగినట్టు గుర్తించి ఆధారాలు సేకరించారు. కాగా ఇంట్లో ఉంచిన మూడున్నర తులాల బంగారు ఆభరణాలు, నాలుగు తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్టు బాధితుడు కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు గోపాలపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం

ఆటోనగర్, ఫిబ్రవరి 24: జీవీఎంసీ 70వ వార్డు పరిధి శ్రామికనగర్ ప్రాంతానికి చెందిన ఎ.గణేశ్ అనే విద్యార్థికి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. బ్రెయిన్ సర్జరీ అవసరం కావడంతో స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. గణేశ్ తండ్రి టైలర్, తల్లి ఈశ్వరమ్మ గృహిణి. ఈ నేపథ్యంలో ఆ కుటుంబానికి చేయూతనందించేందుకు గాను టీడీపీ 70వ వార్డు నాయకుడు పీఎంఎల్ నాయుడు 42 వేలు, సింగంపల్లి దేవి, ప్రసాద్‌లు 38 వేలు కలిపి మొత్తం రూ.80 వేలకు బాధితుని తల్లికి శనివారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సూరిశెట్టి రాజు, కామేశ్వరి, నాని, లక్ష్మి, చిన్న, రమణమ్మ, తదితరులు ఉన్నారు.

రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన రేపు

గోపాలపట్నం, ఫిబ్రవరి 24: అమృత్ భారత్ కార్యక్రమంలో భాగంగా దేశంలోని 554 రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్న నేపథ్యంలో సింహాచలం స్టేషన్‌ను ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయా రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులకు, రైల్వే ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రధాని మోదీ ఈ నెల 26న వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు. ఇందులో భాగంగా సింహాచలం రైల్వే స్టేషన్‌లో వర్చువల్‌గా జరిగే కార్యక్రమం కోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం జరిగే ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, రైల్వే అధికారులు పాల్గొంటారని స్టేషన్ అధికారులు తెలిపారు.


సిద్ధమవుతున్న వేదిక

వైసీపీ జేసీఎస్ ఇన్‌చార్జిగా బొడ్డు సూర్యప్రకాశ్

పెందుర్తి, ఫిబ్రవరి 24: వైసీపీ జేసీఎస్ మండల క్లస్టర్ ఇన్‌చార్జిగా వాలిమెరక పంచాయతీ పరిధి దువ్వపాలేనికి చెందిన బొడ్డు సూర్యప్రకాశ్‌ను నియమిస్తూ శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో వైసీపీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

28న మెగా జాబ్‌మేళా

కంచరపాలెం, ఫిబ్రవరి 24: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల్లో ఈనెల 28వ తేదీ బుధవారం మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ పేర్కొన్నారు.బోర్డు ఆఫ్ అప్రంటీస్‌షిప్ ట్రైనింగ్(బోట్), సదరన్ రీజన్ ,ఆంధ్రప్రదేశ్ సాంకేతి విద్యాశాఖ కమిషనరేట్ వారు సంయుక్తంగా ఈ మెగాజాబ్ మేళాను నిర్వహించనున్నారన్నారు. ప్రముఖ ప్రభుత్వ సంస్థలతోపాటు ప్రైవేటు కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు, డిప్లొమా హోల్డర్లుతో పాటు నాన్ ఇంజినీరింగ్ కోర్సులు బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ తదితర కోర్సులు పూర్తిచేసిన యువత ఈ మేళాలో పాల్గొనవచ్చు. ఉద్యోగ,అప్రంటీస్ శిక్షణ కోసం నిరుద్యోగులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోజు ఉదయం 9.30 గంటల నుంచి సాయంకాలం 4.30 గంటల వరకు జాబ్‌మేళా కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల,కంచరపాలెంలో నిర్వహించనున్నామన్నారు. అభ్యర్థులు అన్నీ ధ్రువపత్రాలు,మూడు సెట్స్ బయోడేటాతో హాజరుకావాలని రమణ కోరారు.

నిరాశ్రయురాలికి వివాహం

దొండపర్తి, ఫిబ్రవరి 24: టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూ టీడీ నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న అనిత (20)కి శనివారం వివాహం జరిపించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ శ్రీనివాస్ తెలిపారు. అనిత తొమ్మిదేళ్ల వయస్సులోనే తల్లిదండ్రులు మృతి చెందారు. పాపా హోం, స్వధార్ హోంలలో ఉంటూ ఇంటర్మీడియట్ వరకు చదువుకుంది. ఆమె మేజర్ కాడంతో స్వధార్ ప్రతినిధులు ఏయూటీడీ షెల్టర్‌కు అప్పగించారు. గతంలో ఏయూటీడీ షెల్టర్‌లో ఉంటూ ఉపాధి పొందిన ఖాదర్(24) అనే యువకుడు ముందుకు వచ్చాడు. దీంతో ఇరువురి అభీష్టం మేరకు వసతి గృహంలో వివాహం జరిపించారు.



స్టాల్స్‌లో ప్లాస్టర్లు అంటించి తాళ్లతో కట్టి ఉన్న విద్యుత్ స్విచ్ బోర్డులు



పనిచేయని ధరలు తెలియజేసే డిజిటల్ బోర్డు

పొంచి ఉన్న ప్రమాదం

» రైతు బజారు స్టాల్స్‌లో వేలాడుతున్న విద్యుత్ స్విచ్‌బోర్డులు
» పనిచేయని డిజిటల్ ధరల బోర్డు

మద్దిపాలెం, ఫిబ్రవరి 24: స్థానిక రైతుబజార్‌లోని పలుస్టాల్స్‌లో విద్యుత్ స్విచ్ బోర్డులు ప్రమాదకరంగా మారాయి. స్టాల్స్ పైభాగంలో ఏర్పాటు చేసిన బోర్డులు కిందకు వేలాడుతూ, వాటికి ప్లాస్టర్లు అంటించడంతోపాటు తాళ్లను కట్టారు. పలుచోట్ల ఇదే పరిస్థితి ఉండటంతో ఈ స్టాల్స్‌లో విక్రయాలు సాగిస్తున్న రైతులు భయాందోళనలు చెందుతున్నారు. ఏమరుపాటుగా నిల్చుని స్విచ్‌బోర్డులు తాకినట్లయితే, ప్రమాదం బారినపడే అవకాశం ఉందని ఆవేదనవ్యక్తంచేస్తున్నారు. చాలా రోజులుగా ఈసమస్య ఉన్నా సంబంధిత అధికారులు చర్యలు చేప ట్టకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కూరగా యల ధరలు తెలియజేసి డిజటల్ బోర్డు సుమారు నాలుగేళ్లగా పని పనిచేయలేదు. మరమ్మతులు చేపట్టకపోవడంతో రైతుబజార్‌కు వచ్చే వినియోగదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు కూరగాయల ధరల డిజిటల్ బోర్డు, స్విచ్ బోర్డులు మార్చాలని పలువురు కోరుతున్నారు.

వైసీపీ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభం

» జనసేన పార్టీ 'ఉత్తర' ఇన్‌చార్జి ఉషాకిరణ్



ప్రచారంలో ఉషాకిరణ్, నాయకులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 24 : ఒంటెద్దు పోకడలతో పరిపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని ఉత్తర నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ అన్నారు.జనంలోకి జనసేన కార్యక్రమంలో భాగంగా 26వవార్డు పార్టీ అధ్యక్షుడు బండి కనకరాజు, మహిళా అధ్యక్షురాలు బోడసింగి విజయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం లలితానగర్‌లో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనసేన. టీడీపీ పార్టీల ఉమ్మడిగా ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. అందు కోసం ఇరుపార్టీల అభ్యర్థులను ఓటు వేసి గెలిపించాలని కోరారు. 60 రోజుల్లో జనసేన, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రానుందన్నారు. రాజధానిలేని ఏపీని అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. నాయకులు కె. బాలాజీ, శ్రీనివాసులు, రాజు, జి. సంపత్,ఎం.సాయి, వార్డు టీడీపీ అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

యాదవ సంఘ భవనానికి నేడు శంకుస్థాపన

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 24: యాదవ సంఘ సామాజిక భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఎండాడ దిశ పోలీస్‌స్టేషన్ వద్ద కేటాయించిన స్థలం వద్ద ఆదివారం భూమి పూజ చేయనున్నట్టు నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి తెలిపారు. శనివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సామాజికి భవనానికి 5 సెంట్ల స్థలాన్ని కేటాయించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ హాల్ నిర్మాణానికి వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి ఆదివారం భూమి పూజ చేస్తారన్నారు. గొలగాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మొల్లి అప్పారావు, పల్లా దుర్గారావు, సారిపల్లి గోవింద్, యువ్వల లక్ష్మీసురేశ్, పీతల గోవింద్, రవికుమార్, మన్యాల శ్రీనివాస్, పీతల వాసు పాల్గొన్నారు.

ఆలోచించి ఓటు వేయాలి: బీజేపీ

కంచరపాలెం, ఫిబ్రవరి 24: మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు శనివారం 47వార్డు పరిధి కప్పరాడ ప్రాంతంలో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. వైసీపీ పాలనపై విమర్శలు చేశారు. ఉత్తర బీజేపీ కన్వీనర్ సురేష్‌బాబు, ఆర్.రాంబాబు, జి.అరుణ్ తదితరులున్నారు.

ఎన్నికల హామీలు అమలు చేసే పార్టీలపైనే విశ్వాసం

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు.. వేదికపై గండి బాబ్జీ, శ్రీభరత్

మహారాణిపేట, ఫిబ్రవరి 24: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసిన పార్టీలపైన ప్రజల్లో విశ్వాసం పెంపొందుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ అనుబంధంగా ఉన్న ప్రొఫెషనల్ వింగ్ ఆధ్వర్యంలో శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన టౌన్‌హాల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు హయాంలో ఆర్థిక కార్యకలాపాలు గాడిలో పెట్టేందుకు తీసుకువచ్చిన సీఎఫ్‌ఎంఎస్ ప్రస్తుత ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. జీవీఎంసీ నిధులను సైతం రాష్ట్రం తీసుకుంటుందన్నారు. త్వరలో ఏర్పాటుకానున్న టీడీపీ, జనసేన ప్రభుత్వం సీఎఫ్‌ఎంఎస్‌లో తప్పులను సవరిస్తామన్నారు. టీడీపీ విశాఖ పార్లమెంటు ఇన్‌చార్జి ఎం. శ్రీభరత్ మాట్లాడుతూ ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. విశాఖ ప్రజలకు మాత్రం తాను ఎప్పుడు అందుబాటులో ఉంటానని, నగర అభివృద్ధిపై దృష్టిసారిస్తానన్నారు. విశాఖ దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ మాట్లాడుతూ విశాఖ పోర్టు కాలుష్యం లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం చూపిందని ఆరోపించారు. భీమిలి టీడీపీ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు మాట్లాడుతూ ప్రభుత్వానికి ఆదాయ మార్గాలు లేనందునే చెత్తపై పన్నులు వేస్తున్నారన్నారు. సమావేశానికి ప్రొఫెషనల్ వింగ్ రాష్ట్ర అధ్యక్షురాలు పి. తేజస్విని, ఉత్తరాంధ్ర అధ్యక్షుడు ఆవాల సతీశ్, రాజు పాల్గొన్నారు.

ముగిసిన లలిత పీఠం వార్షికోత్సవాలు



అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 24 : గ్రేటర్ 26వ వార్డు లలితానగర్‌లోని లలితాపీఠం 75వ వార్షికోత్సవాల్లో భాగంగా ఐదురోజుల పాటు నిర్వహించిన అమృతోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ మేరకు లలితాదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై ఊరేగించారు. మేళతాళాలు, కోలాటం, తప్పెటగుళ్లు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య ఈవేడుక కనుల పండువగా సాగింది. ఈ గ్రామోత్సవంలో గుర్రపురథంపై పీఠాధిపతి సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి, ఓపెన్ కారుపై శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యా నంద భారతీ స్వామి పర్యటించారు. ఈ కార్యక్రమంలో కుర్తాళం పురోహితులుమాచవోలు రమేశ్ శర్మ, లలితాపీఠం మేనేజర్ మన్న వ కృష్ణసేన్, నిర్వాహక కార్యదర్శి వెంపరాల నరసింహమూర్తి, ఉత్స వ కమిటీ అధ్యక్షుడు పీఎల్ఎన్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్, ఫిబ్రవరి 24 ; మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రముఖ ఈఎన్‌టీ వైద్యురాలు కె.జె.ప్రియాంక రోగులకు వైద్య పరీక్షలు చేశారు. చెవి, ముక్కు, గొంతు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మానసిక సమస్యలు, బీపీ, షుగర్ తదతర వైద్య పరీక్షలను టి.స్వప్న, సుస్మిత వైద్య బృందం చేపట్టింది. శిబిరాన్ని వాకర్స్‌క్లబ్ అధ్యక్షులు పల్లా.చంద్రమౌళి పర్యవేక్షించారు. . కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షులు బుచ్చయ్య, సత్యనాథం, ఉపాధ్యక్షులు ఏవీ సుబ్బారావు, కోశాధికారి జె. కూర్మారావు, కార్యదర్శి పి.చెల్వరాజు తదితరులు ఉన్నారు. 200 మందికి వైద్య సేవలను వినియోగించుకున్నారు.


'సమస్యలపై న్యాయవాదుల ఉద్యమం'



మాట్లాడుతున్న శాంతకుమార్

సీతమ్మధార, ఫిబ్రవరి 24 : తమ డిమాండ్ల సాధనకు రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి న్యాయవాదులు సిద్ధమవుతున్నారు. దీనిలో భాగంగా ద్వారకానగర్‌పౌరగ్రంథాలయంలో ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శాంతకుమార్ మాట్లాడుతూ అడ్వకేట్ వెల్ఫేర్ ఫండ్, డెత్ బెనిఫిట్ ఫండ్ రూ.10 లక్షలకు పెంచాలని, 35 ఏళ్ల నుంచి బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్న న్యాయవాదులకు అడ్వకేట్ వెల్ఫేర్ ఫండ్ సౌకర్యం కల్పించాలని, మృతి చెందిన న్యాయవాదులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మ్యాచింగ్ గ్రాంట్ రూ.4 లక్షలు ఆయా కుటుంబాలకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు.

ఘనంగా సైన్స్ ఎక్స్‌పో



ఈ రవీంద్ర భారతిలో నమూనాల ప్రదర్శన

సీతమ్మధార, ఫిబ్రవరి 24 : ద్వారకానగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో సైన్స్ ఎక్స్‌పో సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏయూ బయో కెమిస్ట్రీ ప్రొఫెసర్ రవికుమార్ మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన నమూనాలు ప్రదర్శించడానికి ఇలాంటి సైన్స్ ఎక్స్‌పోలు దోహదపడుతాయన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతో పాటు, అధ్యయనం చేయడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. పలు ప్రాజెక్టులు రూపకల్పనతో సహ విద్యార్థులు భాగస్వామ్యం కావాలనే ఉత్సాహం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ బయో కెమిస్ట్రీ హెచ్‌వోడీ సుభాషిణి దేవి, సంస్థ నార్త్ ఆంధ్ర జోనల్ ఇన్‌చార్జి ఎన్. వెంకటేష్, ప్రిన్సిపాల్ పుష్పలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బీఎస్పీ మరింత బలోపేతం'



మాజీ డీజీపీ పూర్ణచం ద్రరావును అభినందిస్తున్న నాయకులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 24: విశ్రాంత ఐపీఎస్ అధికారి, మాజీ డీజీపీ జె.పూర్ణచంద్రరావు బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా చేరడంతో పార్టీ మరింత పటిష్టమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కదిరి రాము అన్నారు. ఈ మేరకు ఆయనను రాష్ట్ర కార్యాలయంలో కలిసి అభినందించారు. పూర్ణచంద్రరావుసేవలు సేవలు ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా ఆయనను అభినందించారు. ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి, కరణం తిరుపతిరావు, విశ్రాంత జడ్జి గుర్రప్ప, పెదపెంకి శివప్రసాదరావు, బోని కృష్ణ, దివకాల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

హిందూ వివాహ పద్ధతి అన్వయానికే ఉమ్మడి పౌరస్మృతి

» సుప్రీంకోర్టు న్యాయవాది కీర్తిసింగ్



మాట్లాడుతున్న కీర్తి సింగ్

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 24: హిందూ వివాహ పద్ధతి ముస్లింలకు అన్వయించడానికి ఉమ్మడి పౌరస్మృతి తీసుకువస్తున్నారని సుప్రీంకోర్టు న్యాయవాది కీర్తిసింగ్ అన్నారు. ఐద్వా అఖిల భారత మహాసభల్లో భాగంగా సుశీల గోపాలన్ ట్రస్ట్ శనివారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'ఉమ్మడి పౌరస్మృతి'పై నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సివిల్ మ్యాటర్స్‌లో ఎవరి చట్టం వారికి ఉంటుందన్నారు. హిందూ వివాహ వ్యవస్థలో సైతం వివిధ రకాల సంస్కృతి, సంప్రదాయాలుంటాయన్నారు. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో వివాహమైన మహిళలకు వారసత్వ ఆస్తి పొందే హక్కు లేదన్నారు. వీటన్నింటిపై మహిళా సంఘాలు ఉద్యమించాలన్నారు. ఈ సమావేశంలో ఐద్వా ఆలిండియా అధ్యక్ష, కార్యదర్శులు పీకే శ్రీమతి, మరియం దావలే, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రభావతి, రమాదేవి పాల్గొన్నారు.

'దేశం' తొలి జాబితాలో ఇద్దరికి చోటు

... 5వ పేజీ తరువాయి

ఎన్నికల్లో పెందుర్తి నుంచి అసెంబ్లీకి పోటీ చేసి విజయం సాధించారు. అయితే 2004లో టీడీపీ నుంచి పోటీ చేసేందుకు అవకాశం లభించలేదు. 2009లో ప్రజారాజ్యంలో చేరి, కొత్తగా ఏర్పడిన విశాఖ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. రాష్ట్ర విభజన తరువాత 2014లో తిరిగి టీడీపీలో చేరి విశాఖ పశ్చిమ నుంచి విజయం సాధించిన గణబాబు 2017 నుంచి 2019 వరకు ప్రభుత్వ విప్‌గా కొనసాగారు. తిరిగి 2019లో విశాఖ పశ్చిమ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. నియోజకవర్గంలో ప్రత్యామ్నాయం లేకపోవడం, నగరంలో బలమైన గవర సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో అధిష్ఠానం గణబాబుకు మరోసారి అవకాశం ఇచ్చింది. విశాఖ జిల్లాలో మిగిలిన ఐదు సీట్లకు సంబంధించి టీడీపీ, జనసేన మధ్య ఇంకా స్పష్టత రాకపోవడంతో అభ్యర్థులను ప్రకటించలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

పోటీపై బొత్స ఝూన్సీ సందిగ్ధం?

... 5వ పేజీ తరువాయి

ఎప్పుడంటే అప్పుడని' చెప్పి సమాధానం దాటవేసేస్తున్నారు. ఇదిలావుండగా గత ఎన్నికల్లో అంతటి వైసీపీ ప్రభంజనంలో కూడా నగరంలోని నాలుగు అసెంబ్లీ స్థానాల్లోనూ టీడీపీ అభ్యర్థులే గెలుపొందారు. ఇప్పుడు పరిస్థితి మరింత ఘోరంగా ఉందని, వైసీపీకి పరిస్థితులు ఏమాత్రం సానుకూలంగా లేవని పలు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో విశాఖ నుంచి ఎంపీ అభ్యర్థిగా తన భార్యను పోటీకి దింపడంపై బొత్స సత్యనారాయణ సందిగ్ధంలో ఉన్నట్టు పార్టీలో ప్రచారం జరుగుతోంది. ఎన్నికలకు మరో 50 రోజులు కూడా గడువులేదని, అయినా ఎంపీగా పోటీకి దిగేది ఎవరో తెలియని అయోమయ స్థితిలో ఉన్నామని అధికార పార్టీ నేతలు, కార్యకర్తలు వాపోతున్నారు.

అమృత్ భారత్ స్టేషన్లకు రూ.1029.87 కోట్లు

... 5వ పేజీ తరువాయి

కొత్తవలస, రూ.21 కోట్లతో చీపురుపల్లి, రూ.23 కోట్లతో శ్రీకాకుళం రోడ్డు, రూ.19 కోట్లతో నౌపడ జంక్షన్, రూ.12 కోట్లతో పర్లాకిమిడి, రూ.16 కోట్లతో బొబ్బిలి జంక్షన్, రూ.14.76 కోట్లతో పార్వతీపురం, రూ.17.94 కోట్లతో జైపూర్, 21.20 కోట్లతో కోరాపుట్ జంక్షన్ స్టేషన్లను అభివృద్ధి చేయనున్నామన్నారు. కాగా విశాఖ స్టేషన్ అభివృద్ధి నిర్మాణ పనులకు రూ.492.64 కోట్లు కేటాయించగా, తర్వాత అత్యధికంగా రూ.243 కోట్ల వ్యయంతో రాయగడ స్టేషన్‌లో అభివృద్ధి నిర్మాణ పనులు చేపట్టనున్నామన్నారు. కాగా రూ.600 కోట్ల వ్యయంతో విశాఖ, దువ్వాడ, విజయనగరం, దామన్‌జోడి, జగదల్‌పూర్ స్టేషన్ల అభివృద్ధి పనులకు సంబంధించి ప్రధాని నరేంద్రమోదీ ఇటీవల శంకుస్థాపన చేశారన్నారు. వీటి నిర్మాణ పనులు దాదాపు చివరి దశకు చేరాయని తెలిపారు. ఈ సమావేశంలో ఏడీఆర్ఎం సుధీర్‌కుమార్ గుప్తాతో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాఘవేంద్రరావు సేవలు ప్రశంసనీయం



చలసాని రాఘవేంద్రరావును సన్మానిస్తున్న పలువురు వక్తలు

సిరిపురం, ఫిబ్రవరి 24: నాఫ్ కాబ్ డైరెక్టర్‌గా విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు ఎన్నికవడంతో బ్యాంకు ప్రతిష్ట ఇనుమడించిందని వక్తలు పేర్కొన్నారు సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో శనివారం రాత్రి విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అభినందన సభ సంస్థ డైరెక్టర్ చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాఘవేంద్రరావు సారథ్యంలో బ్యాంకులో సాంకేతిక సేవలు ప్రవేశపెట్టారన్నారు. రాఘవేంద్రరావు మాట్లాడుతూ తనకు జరిగిన సన్మానం అర్బన్ బ్యాంకులు క్రెడిట్ సొసైటీల జాతీయ సమాఖ్యకు చెందుతుందన్నారు. బ్యాంకు గౌరవ విశ్రాంత చైర్మన్ మానం ఆంజనేయులు, డైరెక్టర్స్ గుడివాడ భాస్కరరావు, సూర్యనేని నాగభూషణ చౌదరి, అప్పారి జోసెఫ్ స్టాలిన్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

» పరీక్షల ప్రత్యేక అధికారి బి.రాధ

మద్దిలపాలెం, ఫిబ్రవరి 24: జిల్లాలో ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు సజావుగా నిర్వహించాలని పరీక్షల ప్రత్యేక అధికారి బి.రాధ సూచించారు. బుల్లయ్య కళాశాలలో పరీక్షల సిబ్బందితో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వచ్చే నెల ఒకటో తేది నుంచి జరగనున్న పరీక్షలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకూడదన్నారు. అనంతరం జిల్లాలోని 93 పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, స్క్వాడ్ బృందాలు, కస్టోడియన్స్‌కు విధులు వివరించారు. ఈ సమావేశంలో ఆర్ఐవో పి.మురళీధర్, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌జీజీఓస్ కాలనీ హైస్కూల్‌లో గ్రూప్-2 పరీక్షకు ఏర్పాట్లు



ఎన్‌జీజీఓస్ కాలనీలోని పరీక్ష కేంద్రం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 24: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-2 పరీక్ష శనివారంజరగనుంది. గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలను పరీక్ష కేంద్రంగా (కోడ్ నెంబరు 1105070) ఎంపికచేసినట్టు సూపరింటెండెంట్ బి. లక్ష్మీ నరస తెలిపారు. ఈ కేంద్రంలో 200 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు చెప్పారు. ఉదయం 10-30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులంతా ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్షకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే అభ్యర్థులు ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, కాలిక్యులేటర్లు, సెల్‌ఫోన్లు తీసుకు రాకూడదని తెలిపారు.

అభ్యర్థులు అప్రమత్తం

గ్రూప్-2 పరీక్ష రాసే అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ అన్నారు. 889 ఉద్యోగాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4,83,525 అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అర గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు చేరుకోవాలని సూచించారు. నెగిటివ్ మార్కుల విషయంలో జాగ్రత్తగా ఆలోచించి మల్టిపుల్ చాయిస్ జంబ్లింగ్ చేయాలన్నారు. మూడు తప్పులకు ఒక మార్కు కోల్పోతారని హెచ్చరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



47వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న కేకే రాజు

కంచరపాలెం, ఫిబ్రవరి 24 : జీవీఎంసీ 47వ వార్డు పరిధిలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను వార్డు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి ఆధ్వర్యంలో ఉత్తర వైసీపీ నాయకుడు కె.కె.రాజు పాల్గొని శంకుస్థాపనలు చేశారు. సంజీవయ్యకాలనీ, కప్పరాడ, అరుంధతీనగర్, బాపూజీ నగర్ తదితర గ్రామాల్లో .నూతన సామాజిక భవనాల నిర్మాణం, రోడ్లు, కాలువలు, రిటర్నింగ్ వాల్స్ తదితర పనుల కోసం రూ. కోటి 25లక్షలు నిధులను కేటాయించారు. .ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కోరిబిల్లి విజయ్, గురువోజీ, వసంతల అప్పారావు, ఏఈ చాణక్య పాల్గొన్నారు.

ఆలయ షెడ్ నిర్మాణానికి..

సీతమ్మధార: గ్రేటర్ 24వవార్డు రేసపువాని పాలెం శాంతి స్వరూపిణి అమ్మవారు ఆలయం వద్ద కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో రూ.16.50 లక్షల వ్యయంతో నూతన షెడ్ నిర్మాణానికి కేకేరాజు శనివారం శంకుస్థాపన చేశారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

పద్మనాభం(రూరల్), ఫిబ్రవరి 24: వచ్చే నెల 3న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.స్వప్న కోరారు. ఈ మేరకు శనివారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలను వేస్తారని, గ్రామాల్లో కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. లక్ష్యానికి మించి పోలియో చుక్కలను వేయాలని ఆమె సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీకి పాశర్ల ప్రసాద్ రాజీనామా

సింహాచలం, ఫిబ్రవరి 24: టీడీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు శనివారం సోషల్ మీడియాలో ఒక ప్రకటన చేశారు. పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీకి అవకాశం ఇవ్వాలని కోరానని, అధినేత చంద్రబాబు ప్రకటించిన జాబితాను చూసిన తరువాత రాజీనామా నిర్ణయానికి వచ్చానన్నారు. సుమారు నాలుగు దశాబ్దాల పాటు పార్టీకి తాను చేసిన సేవలను గుర్తించపోవడంతో ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 24: కొత్త వెంకోజీపాలెం శ్రీగణేష్ సాయి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు శనివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. వుడా కల్యాణమండపం ఎదురుగా ఉన్న జీవీఎంసీ హరితవనం పార్కులో ప్రారంభమైన ఈ పోటీల్లో సుమారు 50 జట్లు పాల్గొన్నాయి. శనివారం లీగ్‌లు, ఆదివారం క్వార్టర్ ఫైనల్స్, సెమీ ఫైనల్స్, ఫైనల్స్ నిర్వహించనున్నారు. అసోసియేషన్ సభ్యులు ఆరేష్ కుమార్, దాడి ఈశ్వరరావు, ఆడారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 24: అధ్యాపకులు నిరంతరం నూతన జ్ఞానాన్ని అందిపుచ్చుకునే ప్రయత్నం చేయాలని ఏయూ రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్ అన్నారు. యూజీసీ మాలవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ విభిన్న రంగాల నిపుణులతో అందించే శిక్షణ అధ్యాపకుల నైపుణ్యాలను, సామర్థ్యాలను పెంపొందిస్తాయన్నారు. ఎంఎంటీటీసీ కేంద్రం శిక్షణ తరగతుల నిర్వహణలో జాతీయ స్థాయి గుర్తింపు సాధించిందన్నారు. కేంద్రం సంచాలకులు ఆచార్య టి.వి.కృష్ణ మాట్లాడుతూ ఏపీ, తెలంగాణలోని వివిధ డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు రెండు వారాల శిక్షణ తరగతులను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కోర్సు సమన్వయకర్త ఆచార్య సి.వి.నాయుడు మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ తదితర అంశాలపై అధ్యాపకులకు అవగాహన కల్పించామన్నారు. అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న అధ్యాపకులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

పాఠశాలల్లో రెడ్ డే వేడుకలు



రెడ్ డే వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 24: రెడ్ డే వేడుకలను పలు పాఠశాలల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులతో ఎర్ర రంగు దుస్తులను ధరింపజేశారు. ఎర్ర రంగు కలిగిన పండ్లు, కూరగాయలతో అవగాహన కల్పించారు. ఇసుకతోటలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.రమణి, హెచ్‌బీకాలనీ శ్రీ శారదా విద్యానికేతన్ కరస్పాండెంట్ శ్రీనివాసరావు, స్కూల్ ఇన్‌చార్జి త్రినాథరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **భ్రమయుగం :** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **సుందరం మాస్టర్ :** శారద, శరత్, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ముఖ్య గమనిక :** వెంకటేశ్వర
- **సిద్ధార్థ్ రాయ్ :** శ్రీరామ, శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 18, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 24, బెండకాయలు 38, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 48, బీరకాయలు 46, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 26, క్యాబేజి 22, క్యారెట్ 22, దొండకాయలు 36, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 110, బరబాటి 26, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 40, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 210, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 48, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 32, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 48, చిలగడదుంపలు 28, కంద 60, దేముడు చిక్కుడు 58, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	125
ఫారం ధర	--	145
విత్ స్కిన్	--	260
స్కిన్‌లెస్	--	270

మరికొన్ని సిటీ వార్తలు పేజీ[లో..



భీమిలిలోని గోస్తనీ సాగర సంగమం వద్ద భక్తులు



సాగర సంగమంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న దృశ్యం

భీమిలి తీరానికి పోటెత్తిన జనం

భక్తి శ్రద్ధలతో మాఘ పౌర్ణమి స్నానాలు

భీమునిపట్నం, ఫిబ్రవరి 24: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం భీమిలి గోస్తనీ సాగర సంగమంలో పుణ్యస్నానాలకు భక్తులు పోటెత్తారు. సూర్యోదయం నుంచి భక్తులు వివిధ ప్రాంతాలనుంచి తరలివచ్చారు. మాఘపౌర్ణమి రోజు సాక్షాత్తు శ్రీమహావిష్ణువు గంగమ్మతల్లి ఒడిలో నివశిస్తారని భక్తుల విశ్వాసం. ఈరోజున సాగర సంగమంలో గాని, నదులు, సముద్ర జలాలలో గాని పుణ్య స్నానమాచరించి శ్రీమన్నారాయణుడిని, సూర్యభగవానుని, గంగాదేవిని స్మరించడం వల్ల పాపాలు తొలగి పుణ్యం సిద్ధిస్తుందని భక్తులు భావిస్తుంటారు. దీంతో భీమిలి పరిసర ప్రాంతాలతో బాటు, విజయనగరం, ఎస్.కోట, శ్రీకాకుళం ప్రాంతాలనుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్నానాలు ఆచరించారు. భక్తులు తీరంలో ప్రత్యేక పూజలు చేసి సూర్యభగవానుడికి స్మరించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వెలగపూడి

రామ్‌నగర్, ఫిబ్రవరి 24: తూర్పు నియోజకవర్గం శాసన సభ్యుడు వెలగపూడి రామకృష్ణ బాబు 2024 ఎన్నికల కోసం తన తొలి ప్రచారాన్ని శనివారం రామ్‌నగర్‌లో ప్రారంభించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు తెలుగుదేశం పార్టీ పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాలో వెలగపూడి రామకృష్ణ బాబు ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన 28వ వార్డు రామ్‌నగర్‌లో సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి నక్కా కనకరాజు, అల్లీ అప్పలనారాయణ, సన్యాసిరావు, నరసింగరావు, నల్ల అప్పల రాజు, నడిగట్ల శంకరరావు, ప్రకాశ్, శ్రీను, డిల్లీశ్వరి, కనక, మంగమ్మ, ఆశ్లేష, గౌరి, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో అభివృద్ధి పరుగులు

పద్మనాభం(రూరల్): తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రంలో అభివృద్ధి పరుగు పెడుతుందని మాజీ ఎంపీపీ కాళ్ల పద్మ నగేష్ కుమారన్ దంపతులు పేర్కొన్నారు. శనివారం మద్ది, తునిపొలం గ్రామాల్లో సూపర్‌సిక్స్ క్యాలెండరును విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం గడ్డు పరిస్థితుల నుంచి గట్టెక్కాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని, అతనిని ముఖ్యమంత్రిని చేయడమే ఏకైక లక్ష్యమని, ఇందుకోసం నేతలు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. వాటిపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బుగత శ్రీనివాసరావు, బుగత ప్రకాష్, ఎస్.వి.జీ గిరి, తదితరులు పాల్గొన్నారు.



రామ్‌నగర్‌లతో ఎన్నికల ప్రచారం ప్రారంభించిన ఎమ్మెల్యే వెలగపూడి

ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం చెప్పాలి

» జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి సందీప్



పాండ్రంగిలో మాజీ మంత్రి అప్పలనరసింహరాజును కలిసిన సందీప్

పద్మనాభం, ఫిబ్రవరి 24: అప్పులతో ప్రజలను కష్టాలపాలు చేస్తున్న వైసీపీని ఓడించి, టీడీపీ-జనసేన కూటమికి అధికారాన్ని కట్టబెట్టాలని జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్‌పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాలలో జనసేన పల్లెయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇసుక అక్రమ వ్యాపారం, మద్యం దుకాణాల ద్వారా దోపిడీతో వైసీపీ నేతలు ప్రజలను పీడిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన అధికారంలోకి వచ్చిన అనంతరం పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించి, ప్రత్యక్షంగా 25వేలమందికి ఉపాధి కల్పిస్తామన్నారు. ప్రతి కుటుంబానికి ఎక్కడైనా వైద్యం పొందేలా రూ.25లక్షల ఆరోగ్య బీమా అమలు చేస్తామన్నారు. గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు తదితర సమస్యలను పరిశీలించారు. ఎమ్మెల్యే శిలాఫలకాలు వేసి పనులు పూర్తి చేయలేదని విమర్శించారు. వెంకటాపురం, రేవిడి, పాండ్రంగి, బోని, అనంతవరం, పెంట, కొవ్వాడ, గంధవరంలో పర్యటించారు. పాండ్రంగిలో మాజీమంత్రి ఆర్ఎస్‌డీపీ అప్పలనరసింహరాజును కలిశారు. ఈకార్యక్రమంలో జనసేన నాయకులు రామస్వామినాయుడు, నాయుడు, సారధి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

» కమిషనర్ సీఎం సాయి కాంత్‌వర్మ



ముడసర్లోవ ఎగువ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

ఆరిలోవ, ఫిబ్రవరి 24: జీవీఎంసీకి చెందిన ఖాళీ స్థలాలను గుర్తించి వాటిని పరిరక్షించాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయి కాంత్‌వర్మ ఆదేశించారు. ఆయన శనివారం రెండజోన్ ముడసర్లోవ నర్సరీతో పాటు ముడసర్లోవ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ముడసర్లోవ నర్సరీలో మొక్కల వివరాలను డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ ఎం. దామోదరరావును అడిగి తెలుసుకున్నారు. చిల్డ్రన్ పార్కు ఏర్పాటు చేయనున్నందున ఇక్కడ ఉన్న నర్సరీని తరలించేందుకు స్థలపరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. ముడసర్లోవ పరిసర ప్రాంతాల్లో వృథాగా ఉన్న జీవీఎంసీ ఖాళీ స్థలాలపై సర్వే జరిపి ఒక నివేదిక అందించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. అనంతరం 13 వ వార్డులో ఆరిలోవ ఎంఎస్ఎఫ్ నుంచి ఆరిలోవ ఆఖరి బస్టాపు వరకు ఉన్నడబుల్ రోడ్డు లో వ్యర్థాలు, చెత్తలతో నిండి ఉండడాన్నిగమనించిన కమిషనర్ పరిసరాలను శుభ్రపరిచేలా చూడాలని జోనల్ కమిషనర్ జి. శైలజావల్లి, ఏఎంఓహెచ్ కిశోర్‌ను ఆదేశించారు. ఈ పర్యటనలో పర్యవేక్షక ఇంజనీర్ శాంసన్ రాజు, కార్యనిర్వాహక ఇంజనీరు శాంతి రాజు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి వైభవంగా చక్ర స్నానం

సింహాచలం, ఫిబ్రవరి 24: వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన కొండదిగువ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో వార్షిక తిరుకల్యాణ మహోత్సవాలలో భాగంగా శనివారం సంప్రదాయ రీతిలో చక్రస్నానం, మహాపూర్ణాహుతి నిర్వహించారు. పూర్ణాహుతి ద్రవ్యాలను అనువంశిక ధర్మకర్తల కుటుంబానికి చెందిన సుధాగజపతిరాజు, దేవస్థానం ఈఓ ఎస్ శ్రీనివాసమూర్తితో భక్తులచే స్పృశింపజేసి మహాపూర్ణాహితిన శాస్త్రవిధానంలో నిర్వహించారు. అనంతరం చక్రస్నానం జరిపారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవమూర్తిని ఉభయ దేవేరులతో శేషపాన్పు వాహనంపై ఉంచి సింహాచలం ప్రధాన మూడు మాడవీధుల్లో వైభవంగా తిరువీధి జరిపారు.





ఆర్జిత సేవలో సింహాద్రి అప్పన్న , వెంకటేశ్వరస్వామికి చక్రస్నానం అనంతరం పూజలు చేస్తున్న అర్చకులు

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో నిత్యాన్న ప్రసాద పథకానికి సింహాచలం ప్రాంతానికి చెందిన లొడగల కేశవరావు దంపతులు రూ.లక్ష విరాళంగా శనివారం పర్యవేక్షణాధికారి సిరిపురపు కనకరాజుకు అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అంతరాలయ దర్శనం కలిపింఇచి వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

సింహాచలం: వరాహలక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు నిర్వహించారు. గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై ఉంచారు. ఆర్జిత నిత్యకల్యాణోత్సవానికి శ్రీకారం చుట్టారు. అక్షితారోపణం తరువాత మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చి భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

వ్యాపారం లేకుంటే కుటుంబాలు రోడ్డున పడతాయి

» ఫుడ్‌కోర్టుకు తరలిస్తే.. బేరాలు ఉండవు

» 22వ వార్డులో తోపుడుబళ్ల వ్యాపారుల ఆవేదన

మద్దిలపాలెం, ఫిబ్రవరి 24: రహదారి పక్కన వ్యాపారాలు సాగించుకుని గత 25 ఏళ్లగా కుటుంబాలతో సహా జీవిస్తున్నాం. ఇప్పుడు ఉన్నఫలంగా ఫుడ్‌కోర్టుకు తరలిపోవాలంటే వ్యాపారాలు సాగక, జీవితాలు రోడ్డున పడతాయని జీవీఎంసీ 22వ వార్డు చిల్లర వర్తకులు ఆవేదన వ్యక్తం చేశారు. వార్డులో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగుతున్నాయంటూ తోపుడు బళ్లను తరలించేందుకు చూస్తున్నారని, దీనిని అడ్డుకోవాలని అధికారులను కోరుతున్నారు. రోడ్డు మీద ఎలాంటి వ్యాపారాలు చేసినా ఊరుకునేదే లేదని కార్పొరేటర్ మూర్తియాదవ్ హెచ్చరించడంతో వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. వార్డులోని పిఠాపురం కాలనీ నుంచి పీతలవానిపాలెం వరకు సుమారు 150 మంది చిల్లర వర్తకులు తోపుడు బండ్లపై టిఫిన్లు, కొబ్బరిబొండాలు, జిలేబీ, టీ, ఫాస్ట్‌ఫుడ్, ఆటవస్తువులు వంటి పలు వ్యాపారాలు చేస్తున్నారు. 25 ఏళ్లగా ఇదే రోడ్డులో వ్యాపారం చేసుకుని కుటుంబాలు పోషించుకుంటున్నారు. కాగా మాజీ ఎమ్మెల్సీ మాధవ్ నివాసం సమీపంలో ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేస్తామని, అక్కడ బండ్లు పెట్టుకోవాలని కొంతమంది బలవంతం చేస్తున్నారు. ఫుడ్‌కోర్టు పెట్టాలని ప్రతిపాదన చేసిన ప్రాంతం నిర్మానుష్యంగా ఉంటుంది. జనసంచారం లేని ప్రదేశం కావడంతో తమకు వ్యాపారం ఉండదని, కుటుంబాలు రోడ్డున పడతాయని వర్తకులంతా అధికారులు, కార్పొరేటర్ మూర్తియాదవ్ వద్ద విచారం వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకులు, జీవీఎంసీ అధికారులు, పోలీసులు వ్యాపారాలు తొలిగించాలని ప్రయత్నిస్తే ప్రతిపక్షాలు అడ్డుకుంటాయని, కానీ ఈ వార్డులో వారే తరలించాలని చూస్తున్నారని వాపోతున్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు ఫిర్యాదు చేశారు. వ్యాపారాలు సాగేలా చూడాలని అభ్యర్థించారు.



తోపుడు బళ్ల వర్తకులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మూర్తియాదవ్

ఫిర్యాదులు రాలేదు

జీవీఎంసీ 22వ వార్డులో చిల్లర వర్తకులపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. పిఠాపురంకాలనీ, పీతలవానిపాలెం రోడ్డులో తోపుడు బళ్లు, సోమవారం సంత తీసేయాలని ఎలాంటి ఆదేశాలివ్వలేదు. తోపుడు బండ్లు, సంత తరలించాలని ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు.

- విజయలక్ష్మి, జోన్ 3 కమిషనర్

'ఎన్నికల్లో యాదవుల సత్తా చూపిస్తాం'



నిరసన తెలుపుతున్న యాదవ సంఘాల ఐక్యవేదిక సభ్యులు

ఎం.వి.పి.కాలనీ, ఫిబ్రవరి 24: రానున్న ఎన్నికల్లో యాదవుల సత్తా చూపిస్తామని యాదవ సంఘాల ఐక్యవేదిక సభ్యులు ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను హెచ్చరించారు. ఎంపీ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా శనివారం ఉషోదయ కూడలిలో నిరసన తెలిపారు. ఇటీవల వంశీకృష్ణ శ్రీనివాస్‌ను ఉద్దేశించి పంది జాతి అని ఎంపీ అన్నారని, దీనిపై ఆయన క్షమాపణ చెప్పకపోతే ఎంవీవీ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. తూర్పులో ఆయనను ఓడించేందుకు యాదవులంతా కృషి చేస్తామన్నారు. నాయకులు బొట్ట చిన్న యాదవ్, నమ్మి అప్పలరాజు, కోడిబోయిన బాబ్జీ, అనుపమ యాదవ్, లక్ష్మి, సత్యవతి, సావిత్రి, వెంకటరమణ, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి అద్దాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 24: ఎన్టీఆర్ సేవా ట్రస్టు, గీతం ఆస్పత్రి ఇటీవల నిర్వహించిన వైద్య శిబిరంలో ఎంపికచేసిన వారికి శనివారం కళ్లద్దాలను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అందజేశారు. గీతం ఆసక్షాత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలను నిర్వహించినట్టు చెప్పారు ఈ కార్యక్రమంలో బుగత సత్యనారాయణ, నారు గోపి, ముగడ వాసు, మళ్ల రవికుమార్, మొల్లి శంకర్, పల్లా ఉమారాణి, జి.అప్పన్న, బంగార్రాజు, కె.మహేశ్, నూకరాజు, శ్రీను, గౌరీ, వరలక్ష్మి, సోని, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు ప్రణాళికా బద్ధంగా సిద్ధం కావాలి



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాసరావు

భీమునిపట్నం, ఫిబ్రవరి 24: కీలకమైన పదోతరగతి, ఇంటర్ పరీక్షలకు ప్రణాళికా బద్ధంగా విద్యార్థులు సిద్ధంకావాలని సమగ్ర శిక్ష అడిషినల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. శనివారం భీమిలి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో, ఇంటర్ పరీక్షలకు హాజరుగానున్న విద్యార్థినులతో ఆయన సమావేశమయ్యారు. ఏ మాత్రం ఒత్తిడికి గురికాకుండా చదువుకోవాలని సూచించారు. జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి పదో తరగతి పరీక్షలు తొలిమెట్టని అన్నారు. మంచి ఉత్తీర్ణతతో ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించాలన్నారు. ఇంటర్ విద్యార్థినులు నీట్ పరీక్షలకు బాగా చదవాలన్నారు. విశాఖ ఏజీసీడీవో గీత, లక్ష్మి, ప్రిన్సిపాల్ గంగాకుమారి పాల్గొన్నారు.

'ఎన్నికల విధుల్లో మినహాయింపులు ఇవ్వాలి'

మధురవాడ, ఫిబ్రవరి 24 : రానున్న సార్వత్రిక ఎన్నికలు విధులు కేటాయించే ఉపాధ్యాయులకు కొన్ని మినహాయింపులు ఇవ్వాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వి.నరసింహమూర్తి, పి.వి.ఎస్.రాజేంద్ర ప్రసాద్ వర్మ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందించామన్నారు. పదవీ విరమణకు ఏడాది ఉన్న వారికి ఎన్నికల్లో విధులు కేటాయించవద్దని కోరారు. దీర్ఘకాలం అస్వస్థతతో బాధపడుతున్నవారు, వితంతువులు, అవివాహిత మహిళల విషయంలో వెసులుబాటు ఇవ్వాలన్నారు.పొరుగు జిల్లాలకు టీచర్లను ఎన్నికలు విధులకు వేయవద్దని, ఉపాధ్యాయులు పనిచేస్తున్న సమీప నియోజవర్గాల్లోనే వారికి విధులు కేటాయించాలని కలెక్టర్‌ను కోరామన్నారు.

గాయత్రిలో హార్డ్‌వేర్ ఎక్స్‌పో ప్రారంభం



ఇంజనీరింగ్ కళాశాలలో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

కొమ్మాది, ఫిబ్రవరి 24: విద్యార్థులు సృజనాత్మకత ఆలోచనలతో నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ సీఈవో డాక్టర్ డీవీ రామకోటిరెడ్డి అన్నారు. శనివారం గాయత్రి విద్యాపరిషత్ ఇంజనీరింగ్ కళాశాల (అటానమస్)లో ఐఈటీఈ విద్యార్థుల సంఘం, ఈసీఈ డిపార్టుమెంట్ నిర్వహించిన రాష్ట్రస్థాయి హార్డ్‌వేర్ ఎక్స్‌పో కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు మారుతున్న టెక్నాలజీని అవగాహన చేసుకుని దానికి అనుగుణంగా ఆవిష్కరణలు చేపట్టాలని సూచించారు. ఈసీఈ విభాగాధిపతి దీపికారాణి డిపార్టుమెంట్‌లో గత విద్యార్థులు సాధించిన విజయాలను వివరించారు. భవిష్యత్తులో ప్రజలకు అవసరమయ్యే 70 ఉత్తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏబీకే రావ్, అలుమినీ డీన్ మంచుకంటి శ్రీనివాస్, ఐఈటీఈ కో-ఆర్డినేటర్ కీర్తి ప్రియ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కణమాంలో ఎన్ఎస్ఎస్ శిబిరం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఆర్ఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఆనందపురం ఫిబ్రవరి 24: మండలంలోని కణమాం గ్రామంలో నడింపల్లి సత్యనారాయణరాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఎస్ఆర్ఐటీ) కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శిబిరం రెండో రోజు కొనసాగింది. శనివారం గ్రామంలో యువత ఉపాధిపై సర్వే చేపట్టారు. విద్య ప్రాధాన్యతను కళాశాల విద్యార్థులకు గ్రామస్థులకు వివరించారు. అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పలరాం, ప్రిన్సిపాల్ శంబుప్రసాద్, డైరెక్టర్ రాజమురుగుదాస్, ఎన్ఎస్ఎస్ పీవో హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపైకి దూసుకు వచ్చిన కారు

ఆరిలోవ, ఫిబ్రవరి 24: డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తుండగా ఓ కారు అమిత వేగంతో పోలీసులపైకి దూసుకుచ్చింది. దీంతో ఎస్ఐ శ్రీకాంత్‌కు గాయాలయ్యాయి. ఈ సంఘటన విశాఖ వ్యాలీ స్కూల్ రోడ్డు వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... విశాఖ వ్యాలీ స్కూల్ రోడ్డు వద్ద శనివారం రాత్రి ఆరిలోవ పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు చేస్తున్నారు. ఇంతలో ఓ కారు నడుపుతున్న వ్యక్తి దొరికిపోతాననే భయంతో పోలీసుల దగ్గరకు వచ్చిన వెంటనే కారును అమితవేగంతో నడిపాడు. దీంతో రోడ్డు పక్కనే ఉన్న ట్రాఫిక్ ఎస్ఐను రాసుకుంటూ వెళ్లింది. ఈ ప్రమాదంలో ఎస్ఐ కాలికి స్వల్పగాయమయింది. కారు నంబరును బట్టి అడ్రస్ ట్రేస్ చేయగా పీఎం పాలెంనకు చెందినదిగా గుర్తించామని, పూర్తి సమాచారం కోసం ప్రయత్నిస్తున్నామన్నారు.

పబ్లిక్ హెల్త్ వర్కర్లుగా ఐదుగురు నియామకం



నియామకపత్రాలు ఇస్తున్న ఏడీసీ

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 24: విభిన్న ప్రతిభావంతులైన ఐదుగురికి ఉన్నతాధికారుల ఆదేశాలపై పబ్లిక్ హెల్త్ వర్కర్లుగా నియమిస్తూ ఉత్తర్వులను జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు శనివారం అందజేశారు. టి.లక్ష్మమ్మ, వై.నిర్మల, వి.గంగునాయుడు, ఎల్.శివ నారాయణ, ఎం.రాజేశ్ అందుకున్న వారిలో ఉ న్నారు. కేటాయించిన విధుల్లో ఎటువంటి రిమార్కు లేకుండా చిత్తశుద్ధితో నిర్వర్తించాలని సూచించారు.